
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 తమిళనాడు TAMILNADU
ఆదివారం 19 జనవరి 2025





పీఏకే రంగారావుకు జీవిత సాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

ఘనంగా సీఎస్ రావ్ శత జయంతి వేడుకలు

చెన్నై, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): భారత చలనచిత్ర రంగంలో దిగ్గజ సినీ దర్శకుడు, నటుడు, రచయిత 'సీఎస్ రావ్'గా ప్రసిద్ధి చెందిన చిత్తజల్లు శ్రీనివాసరావు శతజయంతి వేడుకలు శనివారం రాత్రి స్థానిక టి.నగర్‌లో ఉన్న ఆంధ్రా క్లబ్‌లో ఘనంగా జరిగాయి. సీఎస్ రావు కుమార్తె దేవీకృష్ణ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రముఖ సినీ చరిత్రకారుడు, నృత్య, సంగీత కళా విమర్శకుడు పీఏకే రంగారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్‌జీఎల్ ట్రస్ట్, రోటరీ క్లబ్ ఆఫ్ చెన్నై స్పాట్‌లైట్ (రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 3234) పీఏకే రంగారావుకు జీవిత సాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేశాయి. అనంతరం కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ.. సీఎస్ రావు చలనచిత్ర రంగానికి చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు. ఆయన సినిమాల్లో జానపదానికి అధిక ప్రాధాన్యం ఇచ్చారని పేర్కొన్నారు. దేశంలోని గొప్పదర్శకుల వరుసలో సీఎస్ రావు అగ్రస్థానంలో నిలుస్తారన్నారు. సీఎస్ రావు బయోగ్రఫీని వచ్చే ఏడాది లోపు రూపొందించాలని ఆయన కుమార్తె దేవీకృష్ణకు రంగారావు సూచించారు. కార్యక్రమంలో దేవీకృష్ణ స్వాగతోపన్యాసం చేస్తూ.. సీఎస్ రావు తమిళం, తెలుగు, కన్నడ, మలయాళ, ఒరియా వంటి దక్షిణాది భాషల్లో 65 చిత్రాలకు దర్శకత్వం వహించారని గుర్తు చేశారు. తెలుగు చిత్రాల్లోనూ ఆయన నటించారన్నారు. కార్యక్రమంలో భాగంగా స్థానిక నుంగంబాక్కంలో ఉన్న శ్రీ వెంకటేశ్వర తెలుగు పాఠశాలకు స్టేషనరీ అందించారు. పారిశ్రామికవేత్త శోభారాజా స్వాగతం పలికిన ఈ కార్యక్రమంలో సీనియర్ నటీమణులు రాజశ్రీ, సచ్చు, వేద విజ్ఞాన వేదిక సంస్థ అధ్యక్షుడు జేకే రెడ్డి తదితరులు కూడా ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి తెలుగు ప్రముఖులు కేకే చౌదరి, ఉప్పులూరి విజయలక్ష్మి తదితరులు హాజరయ్యారు.

22లోగా తేల్చండి!

- వీసీల వ్యవహారంపై గవర్నర్‌కు సుప్రీం అల్టిమేటం
- మీరు పరిష్కరిస్తారా... మమ్మల్ని జోక్యం చేసుకోమంటారా?

చెన్నై, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): 'వైస్ ఛాన్స్‌లర్ల నియామకానికి సంబంధించి మీరు పరిష్కారం చూపుతారా? లేక మమ్మల్ని జోక్యం చేసుకోమంటారా?.. తదుపరి విచారణ వరకు వేచి చూస్తాం. లేకుంటే మేమే తగిన ఆదేశాలు జారీ చేస్తాం' అంటూ దేశ సర్వోన్నత న్యాయస్థానం రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవికి అల్టిమేటం జారీ చేసింది. శాసనసభలో రూపొందించే బిల్లుల్ని ఆమోదించకపోవడం, ఉద్దేశపూర్వకంగా రాష్ట్రపతి పరిశీలనకు పంపించడం వంటి చర్యలతో పాలనాపరమైన ఆటంకాలు సృష్టిస్తున్నారని పేర్కొంటూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ప్రభుత్వం ప్రతిపాదించిన కీలకమైన బిల్లుల్ని ఆమోదించేలా గవర్నర్‌కు ఉత్తర్వులు జారీ చేయాలని ఆ పిటిషన్‌లో అభ్యర్థించింది. ఆ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన సుప్రీంకోర్టు ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికైన ప్రభుత్వానికి గవర్నర్ కట్టుబడి ఉండాలని, ప్రభుత్వం ప్రతిపాదించే బిల్లులను పెండింగ్‌లో ఉంచడం వంటి సమస్యలలో సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవడం సబబుగా ఉండదని పేర్కొంటూ వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరించాలని గవర్నర్‌ను ఆదేశించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం మరో పిటిషన్‌ను దాఖలు చేసింది. ఆ పిటిషన్‌లో మత్స్య విశ్వవిద్యాలయం, రాష్ట్ర పశుసంవర్ధక సాంకేతిక విశ్వవిద్యాలయం, మద్రాసు విశ్వవిద్యాలయం, అంబేద్కర్ విశ్వవిద్యాలయం, డాక్టర్ ఎంజీఆర్ వైద్య విశ్వవిద్యాలయం, వ్యవసాయ విశ్వవిద్యాలయం చట్ట సవరణతో పాటు ఆయుష్ విశ్వవిద్యాలయం ఏర్పాటు ప్రతిపాదన బిల్లు సహా మొత్తం 12 బిల్లులను శాసనసభలో ఆమోదించి గవర్నర్ పరిశీలనకు పంపినా ఆమోదించ కుండా పెండింగ్‌లో ఉంచారని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించిన ఈ బిల్లులను గవర్నర్ ఆమోదించే వీలున్నప్పటికీ వాటిని రాష్ట్రపతి పరిశీలనకు పంపి చేతులు దులుపుకున్నారని పేర్కొంది. గవర్నర్ తీసుకున్న ఈ నిర్ణయం రాజ్యాంగ ధర్మాసనానికి, చట్టానికి వ్యతిరేకమైనదని, అంతేకాకుండా గవర్నర్ చర్యలు సుప్రీంకోర్టులో జరుగుతున్న విచారణను స్తంభింపజేసేలా ఉన్నాయని తెలిపింది. అంతేగాక రాష్ట్రపతి పరిశీలనకు పంపిన బిల్లులలో ఏడింటిని గవర్నర్ సూచన మేరకు పెండింగ్‌లో ఉంచారని, ఒక బిల్లుకు మాత్రమే ఆమోదం తెలిపారని, మరో రెండు బిల్లులు ఇంకా రాష్ట్రపతి పరిశీనలోనే ఉన్నాయని, ఇలా 10 కీలకమైన బిల్లులపై సుప్రీంకోర్టులో విచారణ పెండింగ్‌లో ఉన్నప్పుడు, గవర్నర్, కేంద్ర ప్రభుత్వం (రాష్ట్రపతి) జోక్యం చేసుకోవటం సర్వోన్నత న్యాయస్థానాన్ని, రాజ్యాంగ ధర్మాసనాన్ని అవమానించడమే అవుతుందని వివరించింది. రాష్ట్రప్రభుత్వం పంపిన బిల్లులను నిర్వీర్యం చేసేందుకు, సుప్రీంకోర్టులో విచారణను నీరుగార్చేదిశగానే ఈ చర్యలన్నీ జరుగుతున్నాయనింది. ఈ బిల్లులకు సంబంధించి గవర్నర్, ముఖ్యమంత్రి సమావేశమై సమస్యలను పరిష్కరించుకోవాలని సుప్రీంకోర్టు గతంలో చేసిన సూచన మేరకు రాజ్‌భవన్‌లో తేనీటి విందుకు ముఖ్యమంత్రి వెళ్లి మంత్రివర్గం ఆమోదించిన తర్వాత కూడా బిల్లులను పెండింగ్‌లో ఉంచడం భావ్యం కాదని పేర్కొంటూ వినతిపత్రం సమర్పించినా ప్రయోజనం లేకపోయిందని ఆ పిటీషన్‌లో రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. గవర్నర్‌తో ముఖ్యమంత్రితో భేటీ అయిన తర్వాత మాజీ మంత్రుల అవినీతిపై విచారణ జరిపేందుకు అనుమతి ఇవ్వకుండా, నలుగురు ఖైదీల ముందస్తు విడుదల ప్రతిపాదనకు ఆమోదం తెలుపకుండా పెండింగ్‌లో ఉంచినట్లు తెలిపింది.



శుక్రవారం సాయంత్రం సుప్రీంకోర్టులో విచారణ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున హాజరైన సీనియర్ న్యాయవాదులు శబరీష్ సుబ్రమణియం, పి.విల్సన్, అభిషేక్ సింఘ్వి, ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. గవర్నర్ నిర్లక్ష్య ధోరణి కారణంగా విశ్వవిద్యాలయాలు వీసీలు లేకుండానే కొనసాగుతున్నాయని, కీలకమైన బిల్లులకు ఆమోదించకపోవడంతో

స్తంభించిన పరిపాలన...

పరిపాలనా వ్యవహారాలు కూడా స్తంభించిపోతున్నాయని వివరించారు. ఈ సందర్భంగా ధర్మాసనం స్పందిస్తూ.. ఇదివరకే గవర్నర్‌కు తాము సూచించినా వీసీల వివాదం పరిష్కారం కాలేదా అని ప్రశ్నించింది. రాష్ట్ర ప్రభుత్వ తరఫు న్యాయవాదులు మునుపటి పరిస్థితులే ఇంకా కొనసాగుతున్నాయని తెలిపారు. మూడేళ్లుగా ఈ సమస్య పరిష్కారం లేదని న్యాయవాది పి.విల్సన్ పేర్కొన్నారు. దీనిపై ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. వీసీల వ్యవహారాన్ని తదుపరి విచారణలోగా గవర్నర్ పరిష్కరించకుంటే తామే జోక్యం చేసుకుని పరిష్కరించాల్సి వస్తుందని హెచ్చరించింది. ప్రధాన రిట్ పిటిషన్‌తోపాటు రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన తాజా పిటిషన్‌ను కూడా కలిపి విచారణ చేపడతామని స్పష్టం చేస్తూ తదుపరి విచారణను ఈనెల 22వ తేదీకి వాయిదా వేసింది.



అంతర్జాతీయ పుస్తక ప్రదర్శన ముగింపు సభలో రాష్ట్ర పాఠ్యపుస్తకాల సంస్థ ప్రచురించిన 75 పాఠ్యపుస్తకాలను ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, మాజీ కేంద్ర మంత్రి, ఎంపీ శశిథరూర్

ప్రపంచ దృష్టిని తమిళభాషపై మళ్లించడమే లక్ష్యం

- సీఎం స్టాలిన్
- ముగిసిన అంతర్జాతీయ పుస్తక ప్రదర్శన

చెన్నై, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ దృష్టిని తమిళభాష వైపు మళ్లించడం, తమిళభాషను విశ్వవ్యాప్తం చేయడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీఎం స్టాలిన్ పేర్కొన్నారు. స్థానిక నందంబాక్కంలోని ట్రేడ్‌సెంటర్‌లో ఈ నెల 16న ప్రారంభమైన అంతర్జాతీయ పుస్తక ప్రదర్శన శనివారం మధ్యాహ్నం ముగిసింది. ముగింపు వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆ సందర్భంగా రాష్ట్ర పాఠ్యపుస్తకాల ముద్రణా సంస్థకు చెందిన 75 పుస్తకాలు, రాయితీతో అనువదించిన 30 గ్రంథాలను ఆయన ఆవిష్కరించారు. అదే విధంగా ప్రచురణ సంస్థల నిర్వాహకులు, అనువాదకులు, ప్రచురణ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చిన ప్రముఖులను ప్రత్యేక అవార్డులతో సత్కరించారు. స్టాలిన్ మాట్లాడుతూ... 2023లో ఏర్పాటైన ప్రదర్శనలో 24 దేశాలకు చెందిన ప్రచురణకర్తలు పాల్గొన్నారని, ఆ సందర్భంగా 365 అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నామన్నారు. అదే విధంగా 2024లో 40 దేశాలకు చెందిన ప్రచురణకర్తలు పాల్గొన్న అంతర్జాతీయ పుస్తక ప్రదర్శనలో 752 అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నామని తెలిపారు. ఈ యేడాది 1125 అవగాహన ఒప్పందాలు కుదుర్చుకోవడం సంతోషాన్ని కలింగిస్తోందన్నారు. తమిళ గ్రంథాలను విదేశీ భాషల్లో అనువదించడానికి, అదే విధంగా విదేశీ భాషలకు చెందిన 120 పుస్తకాలను తమిళంలో అనువదించడానికి ఈ ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు తెలిపారు. ఈ పుస్తక ప్రదర్శనలో 78 స్టాళ్లు, బాలల సాహిత్యానికి సంబంధించి 3 స్టాళ్లు ఏర్పాటు చేశామన్నారు. ఆస్ట్రేలియా, బెనిన్, బ్రూనే, బల్గేరియా, చిలీ, సైప్రస్, ఇథియోపియా, గనా, ఐవరీకోస్ట్, జపాన్, కజక్‌స్థాన్, మడగాస్కర్, మారిషస్, మంగోలియా, మొరాకో, మొజాంబిక్, నేపాల్, నైజీరియా, నార్వే, రుమేనియా, సౌదీ అరేబియా, అమెరికా, సౌత్ కొరియా, శ్రీలంక, ఉక్రెయిన్, జింబాబ్వే తదితర 34 దేశాలకు చెందిన ప్రచురణ సంస్థల అధిపతులు పాల్గొన్నారని చెప్పారు. చివరగా అంతర్జాతీయ పుస్తక ప్రదర్శన గ్లోబల్ అంబాసిడర్ అవార్డు, డిజిటల్ స్పెషాలిటీ అవార్డు, ప్రాచీన తమిళ సాహిత్యాభివృద్ధి అవార్డు, ఆధునిక తమిళ సాహిత్యాభివృద్ధి అవార్డు అంటూ ప్రచురణ సంస్థ అధినేతలకు అవార్డులను ప్రదానం చేశారు. మంత్రులు దామో అన్బరసన్, అన్బిల్ మహేష్ పొయ్యామొళి, టీఆర్బీ రాజా, మాజీ కేంద్ర మంత్రి, ఎంపీ శశిథరూర్, ఎంపీ టీఆర్‌బాలు, సుప్రసిద్ధ అమెరికన్ రచయిత థామస్ హిటోసి ప్రూక్స్‌మా, రాష్ట్ర పాఠ్యపుస్తకాల ప్రచురణ సంస్థ అధ్యక్షుడు దిండుగల్ ఐ లియోని, పాఠశాలల విద్యాశాఖ కార్యదర్శి ఎస్.మధుమతి, రాష్ట్ర పాఠ్యపుస్తకాల సంస్థ డైరెక్టర్ పి.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎల్‌సీ ఛైర్మన్‌కు ప్రతిష్ఠాత్మక ఐపీఎంఏ అవార్డు



శివథాను పిళ్లై నుంచి అవార్డు స్వీకరిస్తున్న ప్రసన్న కుమార్

చెన్నై, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): వివిధ క్లిష్టమైన ప్రాజెక్టులను వ్యూహాత్మక స్థాయిలో అమలు చేయడంతో పాటు తన నిబద్ధత, ఆదర్శవంతమైన నాయకత్వ నైపుణ్యాలతో పురోభివృద్ధి సాధించినందుకు నైవేలి లిగ్నైట్ కార్పొరేషన్ (ఎన్‌ఎల్‌సీ) ఛైర్మన్ ప్రసన్నకుమార్ మోటుపల్లిని అత్యంత ప్రతిష్ఠాత్మకమైన 'ఇంటర్నేషనల్ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్' (ఐపీఎంఏ) అవార్డు వరించింది. నైవేలిలో శనివారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో 'బ్రహ్మోస్' ఏరోస్పేస్ సీఈవో పద్మభూషణ్ డాక్టర్ శివథాను పిళ్లై ఈ అవార్డును ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఇంకా ఎన్‌ఎల్‌సీఐఎల్ ఫంక్షనల్ డైరెక్టర్లు సమీర్ స్వరూప్, ఎం.వెంకటాచలం, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ అప్పాకన్ను గోవిందరాజన్ తదితరులు పాల్గొన్నారు. ఐపీఎంఏ అనేది ప్రపంచవ్యాప్తంగా 70 దేశాలకు చెందిన సంఘాల సమాఖ్య. ప్రపంచవ్యాప్తంగా ఈ అవార్డు పొందిన 500 మంది ప్రసిద్ధ వ్యక్తుల్లో ప్రసన్నకుమార్ మోటుపల్లి పేరు కూడా చేరడం విశేషం. ఇప్పటి వరకూ ఈ అవార్డును భారత్ నుంచి 40 మంది మాత్రమే అందుకున్నారు. ఈ సందర్భంగా మోటుపల్లి మాట్లాడుతూ.. ఈ విజయాన్ని తన ప్రస్తుత సంస్థ అయిన ఎన్‌ఎల్‌సీఐఎల్, గుజరాత్ స్టేట్ ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్ లిమిటెడ్, ఎన్‌టీపీసీకి, ఇంతకాలం తనతో కలిసి పని చేస్తున్న సహచరులందరికీ అంకితం ఇస్తున్నట్లు ప్రకటించారు.

పంచరత్న కీర్తనలతో త్యాగయ్యకు నీరాజనం

- తిరువయ్యారులో 1000 మందికి పైగా సంగీత విద్వాంసులు



ప్రత్యేక అలంకారంలో త్యాగరాజ స్వామి



పంచరత్న కీర్తనలు ఆలపిస్తున్న కళాకారులు

ప్యారీస్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): తంజావూరు జిల్లా తిరువయ్యారులో 175వ వార్షిక త్యాగరాజస్వామి ఆరాధన ఉత్సవాల్లో శనివారం వెయ్యిమందికి పైగా సంగీత దిగ్గజాలు పాల్గొని పంచరత్న కీర్తనలతో స్వామివారికి నీరాజనం పలికారు. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన కళాకారులు వేదికపై శ్రావ్యంగా త్యాగయ్య రచించిన కీర్తనలు ఆలపించి శ్రోతలను మైమరిపించారు. ఈ సందర్భంగా స్వామి వారిని రకరకాల పూలు, పండ్లు, పత్రాలు, ఆభరణాలతో సుందరంగా అలంకరించారు. భారతీయ శాస్త్రీయ సంగీత సంప్రదాయాల్లో తనకంటూ ప్రత్యేకతను చాటుకున్న త్యాగరాజు కర్ణాటక సంగీత ముమ్మూర్తులలో ఒకరు. శ్రీరాముడిపై విశేష భక్తి కలిగిన సద్గురు త్యాగరాజస్వామి 1767 మే 4న తిరువారూర్‌లో జన్మించి 1847 జనవరి 6న ముక్తిపొందారు. తిరువయ్యారు కావేరి నది ఉత్తర ప్రాంతంలో ఆయనకు సమాధి ఏర్పాటైంది. అప్పటి నుంచి ఏటా 'శ్రీ త్యాగబ్రహ్మ మహోత్సవ' ఆధ్వర్యంలో నిర్వహించే ఆరాధనోత్సవంలో సంగీత కళాకారులు పాల్గొని తిరువయ్యారులో నివాళులర్పిస్తారు. ఆ రీతిలో ఈ నెల 14న 178వ ఆరాధన ఉత్సవాలను మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ ఉత్సవాల్లో ప్రధాన అంశమైన పంచరత్న కీర్తనలతో స్వామివారికి నివాళి అర్పించే వేడుక శనివారం కోలాహలంగా జరిగింది. ఉదయం 8.30 గంటలకు సంగీత విద్వాంసులు సుధా రఘునాథన్, మహతి, ఓఎస్ అరుణ్, కడలూర్ జనని, హరిద్వార మంగళం పళనివేలు, రాజారావు, త్రివేండ్రం కృష్ణకుమార్ సహా వెయ్యి మంది కళాకారులు పాల్గొన్నారు. ముందుగా త్యాగరాజస్వామి నివసించిన ఇంటి నుంచి ఆయన విగ్రహాన్ని ప్రధాన వీధుల మీదుగా ఊరేగించి వేదిక ప్రాంగణానికి తరలించారు. రాత్రి 8 గంటలకు స్వామి వారి పల్లకీ సేవ, రాత్రి 11 గంటలకు ఆంజనేయ ఉత్సవం, చివరిగా హారతితో త్యాగరాయ ఆరాధనోత్సవాలు ముగిశాయి.

చెన్నైకి తిరుగుముఖం

- సొంతూళ్ల నుంచి చేరుకుంటున్న జనం
- పెరుంగళత్తూరులో పెరిగిన వాహనాల రద్దీ
- గంటల తరబడి స్తంభించిన ట్రాఫిక్



తాంబరం జీఎస్టీ రోడ్డు నత్తనడక నడుస్తున్న వాహనాలు

చెన్నై, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ కోసం సొంతూళ్లకు వెళ్లిన జనం చెన్నైకి తిరుగుముఖం పట్టారు. దీంతో వేలాది బస్సులు, కార్లు, జీపులు తదితర వాహనాలతో రహదారులన్నీ కిటకిటలాడుతున్నాయి. నగర శివారు ప్రాంతాల్లో శనివారం వేకువజామున రాకపోకలు స్తంభించాయి. రాష్ట్ర రవాణా సంస్థ శుక్రవారం ప్రత్యేక బస్సులు నడిపింది. ఈ ప్రత్యేక బస్సులను ఆదివారం అర్ధరాత్రి దాకా నడపనున్నారు. ప్రభుత్వ రవాణా సంస్థ బస్సుల్లో టిక్కెట్లు రిజర్వు చేసుకున్నవారు, రవాణా సంస్థ బస్సుల్లో టికెట్లు లభించనివారు ఆమ్నీ బస్సుల్లో తిరిగి వస్తుండటంతో చెన్నై శివారు ప్రాంతమైన పెరుంగళత్తూరు, కీలంబాక్కం తదితర ప్రాంతాల్లో శుక్రవారం రాత్రి 10 గంటల నుంచే రవాణా సంస్థ, ఆమ్నీ బస్సులు నగరం వైపు రావటంతో అక్కడక్కడా ట్రాఫిక్ స్తంభించింది. పాఠశాలలు, కళాశాలలు సోమవారం నుంచి తెరుస్తుండడంతో విద్యార్థులందరూ ఒక రోజు ముందుగానే చేరుకునేలా ముందస్తు ప్రణాళిక మేరకు చేరుకుంటున్నారు. శనివారం మధ్యాహ్నం దక్షిణాది జిల్లాల్లోని ప్రముఖ నగరాల నుంచి విద్యార్థులు బస్సులలో తిరిగి వస్తుండటంతో చెంగల్పట్టు, సింగపెరుమాళ్‌కోవిల్, పూందమల్లి, ఆవడి, అంబత్తూరు తదితర ప్రాంతాల్లో వాహనాల రాకపోకలు అధికమయ్యాయి. మధురవాయల్, పోరూరు టోల్‌గేట్ మీదుగా రావడంతో ఆ రెండు చోట్ల ట్రాఫిక్ స్తంభించింది. ఆమ్నీ బస్సుల్లో వచ్చే ప్రయాణికులందరిని పోరూరు టోల్‌గేట్ వద్దే దింపేస్తుండటంతో సిటీ బస్సుల కోసం, ఆటోలు, టాక్సీల కోసం వేచి ఉండాల్సి వచ్చింది. ఇదే విధంగా పలు జిల్లాల నుంచి వచ్చే బస్సులు, కూరగాయల లోడుతో వచ్చే సరకుల లారీలు శనివారం ఉదయమే నగరంలోకి వచ్చాయి. పూందమల్లి రహదారిలో ఒకే సమయంలో వంద సంఖ్యలో బస్సులు ఒకదాని వెంట ఒకటిగా వరుసగా రావటంతో వానగరం జంక్షన్, కోయంబేడు మేట్టుకుళం జంక్షన్, పూందమల్లి హైరోడ్డు, 100 అడుగుల రహదారి తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు ట్రాఫిక్ పోలీసులు తంటాలు పడ్డారు. ఆదివారం నగరానికి వచ్చేందుకు రవాణా సంస్థ బస్సుల్లో 75 వేల మంది టిక్కెట్లు రిజర్వు చేసుకున్నారు. ఇదే విధంగా ఆమ్నీ బస్సులలో లక్షమందికి పైగా టికెట్లు రిజర్వు చేసుకున్నారు. దీనితో ఆది, సోమవారాల్లో నగరానికి లక్షల సంఖ్యలో ప్రయాణికులు తరలివస్తారని, ఆ సందర్భంగా తాంబరం, పూందమల్లి, అంబత్తూరు వైపు వందల సంఖ్యలో బస్సులు సాఫీగా ముందుకు కదలలేని పరిస్థితులు ఏర్పడే అవకాశాలు ఉన్నాయని ట్రాఫిక్ విభాగం పోలీసులు చెబుతున్నారు. దీనిని క్రమబద్ధీకరించేందుకు మరింతమందిని నియమించనున్నారు.



పెరుంగళత్తూరు వద్ద శనివారం వేకువజామున నిలిచిన వాహనాలు

సమాచార దర్శిని

25న రైతుల ట్రాక్టర్ ర్యాలీ

ప్యారీస్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ ఉత్పత్తులకు కనీస గిట్టుబాటు ధర నిర్ణయించాలని కోరుతూ ఈనెల 25న రాష్ట్రవాప్తంగా ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించనున్నట్లు రైతుల సంఘం నాయకులు ప్రకటించారు. వ్యవసాయ ఉత్పత్తులకు కనీస గిట్టుబాటు మద్దతు ధర ప్రకటించాలని కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ, ఢిల్లీలో అఖిల భారత రైతుల సంఘాలు నిర్వహించిన ఆందోళనకు తమిళనాడు రైతు సంఘాల సమాఖ్య మద్దతుగా నిలిచింది. ఈ నేపథ్యంలో తిరుచ్చిలో దక్షిణ భారత నదుల అనుసంధానం రైతుల సంఘం అధ్యక్షుడు అయ్యాకన్ను, కావేరి రైతుల సంఘ ప్రధాన కార్యదర్శి పాండియన్ శుక్రవారం సంయుక్తంగా విలేకరులతో మాట్లాడారు. విద్యుత్ సవరణ చట్టంలో వ్యవసాయానికి ఉచిత విద్యుత్ పంపిణీ చేయాలని, రైతుల రుణాలు మాఫీ చేయాలని, వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర ప్రకటించాలని తదితర డిమాండ్లతో ఈ నెల 25న ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

29న సైబర్ నేరాలపై అవగాహన మారథాన్

పెరంబూర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై పోలీసు శాఖ పరిధిలోని సైబర్ క్రైం ఆధ్వర్యంలో ఈనెల 29వ తేది మెరీనా బీచ్ రోడ్డులో ఉదయం 5 గంటలకు 'చెన్నై 1930 అవగాహన వాకథాన్' నిర్వహించనున్నారు.ఈ విషయమై పోలీసు శాఖ విడుదల చేసిన ప్రకటనలో... సాంకేతికత అభివృద్ధితో పాటు సైబర్ నేరాలు కూడా అధికమవుతున్నాయన్నారు. ప్రజలకు ఈ నేరాలపై సరైన అవగాహన లేకపోవడంతో భారీగా నష్టపోతున్నారన్నారు. ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించేలా వాకథాన్ నిర్వహించనున్నామని, ఆసక్తి కలిగిన వారు https://1930walkathon.inలో పేరు న మోదు చేసుకోవాలని, వాకథాన్‌లో పాల్గొన్న వారికి బ్లాక్ చైన్ డిజిటల్ సర్టిఫికెట్ అందజేయనున్నట్లు పోలీసు శాఖ తెలిపింది.

పొంగల్ కానుక తీసుకోని 33లక్షల మంది

ప్యారీస్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం అమలు చేసిన పొంగల్ కానుకను 33 లక్షల మంది తీసుకోలేదని పౌరసరఫరాల శాఖ అధికారులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 2.21 కోట్ల బియ్యంకార్డులకు పొంగల్ పండుగ సందర్భంగా ప్రభుత్వం కానుక ప్రకటించింది. బియ్యం, పంచదార, చెరకు గడలను 85 శాతం మంది అంటే 1.87 కోట్ల మంది రేషన్ దుకాణాలకు వెళ్లి పొందారు. ఈ సారి పొంగల్‌కు సరుకులతో పాటూ, రూ.1000 నగదు లేకపోవడంతో 33 లక్షల మంది పొంగల్ కానుక తీసుకోలేదు. గత ఏడాది పొంగల్‌కు 2.20 కోట్ల రేషన్‌కార్డుకు తలా రూ.1000 నగదు, కిలో పచ్చి బియ్యం, చక్కర, చెరకు గడలు ప్రకటించగా, వాటిని 2.08 కోట్ల మంది పొందడం గమనార్హం. దీనిపై రేషన్ సిబ్బంది మాట్లాడుతూ.. ఇంటింటికీ కానుక టోకెన్లు పంపిణీ చేయగా పలువురు తీసుకోలేదని, అంతేకాకుండా గత ఏడాది కంటే సరుకుల కొలత కూడా తగ్గించడం కారణమని అభిప్రాయపడ్డారు.

25న భాషోద్యమ వీరుల సంస్మరణ సభ

- అన్నాడీఎంకే చీఫ్ ఈపీఎస్

ప్యారీస్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): హిందీ భాషకు వ్యతిరేకంగా పోరాటంలో పాల్గొని మరణించిన భాషోద్యమ వీరులకు నివాళులర్పించే సంస్మరణ సభ ఈనెల 25న రాష్ట్రవాప్తంగా నిర్వహించనున్నట్లు అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ప్రకటించారు. ఆయన శనివారం విడుదల చేసిన ప్రకటనలో, అన్ని జిల్లాల్లో సంస్మరణ సభలు నిర్వహించే ప్రాంతాలు, వాటిలో పాల్గొననున్న పార్టీ ప్రముఖుల వివరాలు ఉన్నాయి. జిల్లా విద్యార్థి విభాగం కార్యదర్శులు, సంబంధిత జిల్లా కార్యదర్శులు, ఎంజీఆర్ యువజన విభాగం, అమ్మాపేరవై, మహిళా విభాగం, అన్నా కార్మికుల సంఘం, న్యాయవాదుల విభాగం మైనార్టీ సంక్షేమ విభాగం నిర్వాహకులతో కలిసి సభను విజయవంతం చేయవలసిందిగా ఈపీఎస్ తన ప్రకటనలో కోరారు.




హైతియమ్మన్ ఆలయ మైదానంలో గ్రామస్తులు - అగ్నిగుండంలో నడచి వెళుతున్న ఆలయ ప్రధాన పూజారి

హైతియమ్మన్ ఆలయ వేడుకలకు పోటెత్తిన భక్తజనం

టి.నగర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లా కున్నూరులో జగతాల, ఆరూరు గ్రామాల్లో నివసించే పడుగర్ జాతి గిరిజనులు హైతియమ్మన్ ఆలయ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. యేటా జనవరి రెండో వారంలో అమ్మవారి వార్షిక ఉత్సవాలు జరుగుతాయి. ఆ సందర్భంగా పడుగర్ కులస్థులైన గ్రామస్తులు 48 రోజులపాటు వ్రతమాచరించి అగ్నిగుండ ప్రవేశం చేస్తుంటారు. ఆ మేరకు శుక్రవారం జరిగిన వేడుకలకు జగతాల, కార్‌కొరై, ఓతండి, పేరట్టి, మల్లికొరై, మంజుతాల, చిన్న పిక్కట్టి, పెరియ పిక్కట్టిలకు చెందిన ప్రజలు కార్‌కొడైమడిషైన వద్ద నున్న హైతియమ్మన్ ఆలయ ప్రాంతానికి చేరుకున్నారు. సుమారు నాలుగువేల మంది అమ్మవారి అనుగ్రహం కోసం పూజలు నిర్వహించారు. శనివారం వేకువజామున అగ్నిగుండ ప్రవేశం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ ప్రధాన పూజారి తొలుత అగ్నిగుండ ప్రవేశం చేశారు. ఆటలు పాటలతో గిరిజనులు తమ సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించారు.

తెన్‌పెన్నైయారు వద్ద కొలువుదీరిన దేవుళ్లు

- తీర్థవారికి పోటెత్తిన భక్తజనం



తెన్‌పెన్నైయారు వాగు వద్ద కొలువుదీరిన దేవతామూర్తులు,

చెన్నై, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లాల్లో భోగి, సంక్రాంతి, పశువుల పండుగ, కనుమ పండుగ సంబరాలు సందడి సద్దుమణగిన నేపథ్యంలో ఆ జిల్లా అంతటా శనివారం ఉదయం 'ఆట్రు తిరువిళా' పేరుతో వాగులు, వంకల వద్ద ఆయా ప్రాంతాలకు చెందిన ఆలయాల్లోని ఉత్సవమూర్తులను ఊరేగింపుగా తీసుకొచ్చి 'తీర్థవారి' నిర్వహించారు. ఈ యేడాది ఫెంగల్ తుఫాను, ఈశాన్యరుతుపవనాల ప్రభావిత వర్షాల కారణంగా తెన్‌పెన్నైయారు జలకళను సంతరించుకుంది. దీంతో కడలూరు, నెల్లికుప్పం, వండిపాళయం సహా వందకు పైగా గ్రామ దేవతామూర్తులను సర్వాలంకరణతో తెన్‌పెన్నైయారు వాగు వద్దకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. భక్తులంతారహదారికి ఇరువైపులా నిలిచి ఆయా దేవుళ్లకు కర్పూరనీరాజనాలు సమర్పించారు. వాగు పొడవునా వరుసగా నిలిచి కర్పూర నీరాజనాలు సమర్పించారు. అదే సమయంలో ఆ ప్రాంతమంతటా తినుబండారాల దుకాణాలు, ఆటబొమ్మల దుకాణాలు, పండ్ల దుకాణాలు, స్వీట్ల దుకాణాలు పూల దుకాణాలు ఏర్పాటయ్యాయి. శనివారం ఉదయం నుంచి సాయంత్రం దాకా ఈ 'ఆట్రు తిరువిళా' కొనసాగింది.

టాస్మాక్ దుకాణంలో చోరీ



టాస్మాక్ దుకాణాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

తిరుత్తణి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా మాతూర్ గ్రామంలో ఉన్న టాస్మాక్ దుకాణంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి మద్యం బాటిళ్లు, డబ్బును దొంగిలించారు. సూపర్‌వైజర్ అయ్యప్పన్, ఐదుగురు సేల్స్‌మెన్ శుక్రవారం రాత్రి దుకాణం మూసివెళ్లారు. శనివారం ఉదయం 11.30 గంటలకు వారు దుకాణం తెరిచేందుకు రాగా, తాళం పగులగొట్టబడి ఉండడాన్ని గుర్తించి పోలీసులు ఫిర్యాదు చేవారు. వారు సంఘటనా స్థలానికి చేరుకుని దుకాణాన్ని పరిశీలించారు. గోడకు రంధ్రం వేసి, లోపలికి ప్రవేశించినట్లు రూ.5 వేల నగదు, ఐదు బీరు బాటిళ్లు చోరీ అయినట్లు గుర్తించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మదురై, తిరుచ్చిలలో టైడల్ పార్కులు

- పర్యావరణ శాఖ గ్రీన్ సిగ్నల్

చెన్నై, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మదురై, తిరుచ్చి మహానగరాల్లో టైడల్ పార్కుల నిర్మాణానికి రాష్ట్ర పర్యావరణశాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వ నిర్వహణలోని టైడల్ పార్క్ సంస్థ చెన్నై తరమణి, పట్టాభిరాం, కోవై తదితర ప్రాంతాల్లో ఇప్పటికే టైడల్ పార్కులున్న విషయం తెలిసిందే. కాగా మదురై, తిరుచ్చిల్లో టైడల్ పార్కులు ఏర్పాటు చేయనున్నట్లు గత అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందుకు అవసరమైన స్థల సేకరణ పూర్తయింది. ఈ నేపథ్యంలో ఆ రెండు టైడల్ పార్కులకు ఆ శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. తిరుచ్చిలోని మదురై హైవేలో పంజపూర్ ప్రాంతంలో బస్టాండు వద్ద 14.16 ఎకరాల విస్తీర్ణంలో రూ.315 కోట్లతో టైడల్ పార్క్ నిర్మితం కానుంది. అదే విధంగా మదురై మాట్టుదావనిలో కార్పొరేషన్‌కు చెందిన 9.97 ఎకరాల్లో రూ.289 కోట్లతో టైడల్ పార్క్ నిర్మితం కానుంది.

జైళ్లలోకి గంజాయి, సెల్‌ఫోన్లు ఎలా చేరుతున్నాయి?

- ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు

ప్యారీస్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా జైళ్లలో 'స్కానర్' తదితర గట్టి భద్రతా ఏర్పాట్లు ఉన్నా.. గంజాయి, సెల్‌ఫోన్లు ఎలా వెళ్తున్నాయని ప్రశ్నించిన మద్రాస్ హైకోర్టు.. జైళ్ల శాఖ డీజీపీ నివేదిక దాఖలు చేయాలంటూ ఉత్తర్వులు జారీ చేసింది. ఓ హత్య కేసులో పట్టుబడిన బిలాల్ మాలిక్, సయ్యద్ మహ్మద్ ఇస్మాయేల్, యోగేష్ పుళల్ సెంట్రల్ జైలులో బంధీలు. ఈ నేపథ్యంలో వీరి కుటుంబ సభ్యులు హైకోర్టులో వేర్వేరుగా పిటీషన్లు దాఖలు చేశారు. జైలు అధికారులు జరిపిన దాడిలో బిలాల్ మాలిక్, సయ్యద్ మహ్మద్ ఇస్మాయేల్, యోగేష్‌కు తీవ్రగాయాలయ్యాని అయితే ఇప్పటి వరకు ఎలాంటి చికిత్సలు అందించలేదని, ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించేలా ఉత్తర్వులు జారీ చేయాలని న్యాయస్థానానికి విజ్ఞప్తి చేశారు. ఈ మూడు పిటిషన్లను శుక్రవారం హైకోర్టు న్యాయమూర్తులు ఎస్ఎస్ సుబ్రమణ్యం, వి.లక్ష్మీనారాయణన్‌లతో కూడిన ధర్మాసనం ముందు విచారణకు రాగా, పిటీషనర్ల తరుపు న్యాయవాది పుహలేంది వాదించారు. జైలు అధికారులు నిర్వహించిన తనిఖీల్లో ఖైదీల నుంచి సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారని, ఈ వ్యవహారంలో అధికారులు ఖైదీల మధ్య జరిగిన ఘర్షణలో గాయపడిన పలువురు ఖైదీలకు వైద్యచికిత్స అందించలేదని పేర్కొన్నారు. దీనిపై ప్రభుత్వ తరుపు న్యాయవాది రాజ్‌తిలక్ అభ్యంతరం తెలిపారు. ఇరు తరుపు వాదనలు విన్న అనంతరం జైలులో ఖైదీలు, అధికారుల మధ్య ఘర్షణకు సంబంధించి విచారణ జరపాలని, గాయపడిన ఖైదీల ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యుల బృందం ఈ నెల 21వ తేదీన నివేదిక దాఖలు చేయాలని హైకోర్టు ఆదేశించింది.

న్యాయాన్ని, చట్టాన్ని కాపాడేందుకు పాటుపడండి

- డీఎంకే లాయర్లకు మంత్రి దురైమురుగన్ పిలుపు



న్యాయవాదులను సత్కరిస్తున్న మంత్రి దురైమురుగన్

చెన్నై, జనవరి 18(ఆంధ్రజ్యోతి): న్యాయాన్ని, చట్టాన్ని కాపాడేందుకు డీఎంకే న్యాయవిభాగ సభ్యులందరూ పాటుపడాలని సీనియర్ మంత్రి దురైమురుగన్ పిలుపు నిచ్చారు. రాష్ట్రంలో ప్రభుత్వ పథకాలకు, అమలు చేయాలనుకున్న చట్టాలకు ప్రతిపక్షాలు అదే పనిగా అడ్డుపుల్లలు వేస్తున్నాయని, ఈ విషయాన్ని గ్రహించి డీఎంకేకు చెందిన న్యాయవాదులంతా న్యాయపోరాటం చేసేందుకు సిద్ధం కావాలన్నారు. శనివారం ఉదయం నగరంలో పచ్చయప్ప కళాశాల ఎదురుగా ఉన్న సెయింట్‌జార్జి ఆంగ్లో ఇండియన్ మహోన్నత పాఠశాల మైదానంలో జరిగిన డీఎంకే న్యాయవాదుల విభాగ తృతీయ సదస్సులో ఆయన ప్రసంగించారు. డీఎంకే ఆరంభ దినాల్లో పార్టీ తరఫున గోకులకృష్ణన్ న్యాయవాదిగా సేవలం దించారని, కోయంబత్తూరు నుంచి గుమ్మిడిపూండి వరకు పార్టీకి వ్యతిరేకంగా ఏ కేసు వచ్చినా ఆయనే వాదించే వారన్నారు. గోకులకృష్ణన్ న్యాయమూర్తిగా పదవిని చేపట్టాక డీఎంకేకు షణ్ముగసుందరం న్యాయవాదిగా పనిచేశారని చెప్పారు. మంత్రి కేఎన్ నెహ్రూ మాట్లాడుతూ... డీఎంకే ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు దాఖలు చేసే అన్యాయపు కేసులను సమర్థవం తంగా ఎదుర్కొనే బాధ్యత న్యాయవాదులదేనని చెప్పారు. వచ్చే యేడాది జరిగే శాసనసభ ఎన్నికల్లో మళ్లీ డీఎంకే ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. డీఎంకే వ్యవస్థాపక కార్యదర్శి ఆర్ఎస్ భారతి, న్యాయశాఖ కార్యదర్శి ఎన్ఆర్ ఇలంగో మంత్రి తంగం తెన్నరసను, ఎంపీలు గిరిరాజన్, కనిమొళి సోము, పూచ్చి మురుగన్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



చెన్నై, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రశాంత్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో శనివారం 'కార్పొరేట్ క్రికెట్ టోర్నమెంట్' ప్రారంభమైంది. పుదువాయల్‌లో ఉన్న టీజేఎస్ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన ఈ వేడుకకు ముఖ్య అతిథిగా కళాశాల అధినేత, ఎమ్మెల్యే టీజే గోవిందరాజన్, ప్రశాంత్ హాస్పిటల్స్ ఎండీ డాక్టర్ ప్రశాంత్ కృష్ణ, సీఈవో డాక్టర్ భాస్కరన్ తదితరులు కూడా హాజరయ్యారు. ఈ టోర్నమెంటులో మొత్తం 36 కార్పొరేట్ జట్లు పాల్గొంటుండగా, ఛాంపియన్ జట్టుకు రూ.50 వేలు, రన్నరప్‌కు రూ.25 వేలు ఇవ్వనున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రశాంత్ కృష్ణ మాట్లాడుతూ... గుండె ఆరోగ్యం, వైద్యం, సంరక్షణపై అవగాహన కల్పించేందుకే తామీ పోటీలు నిర్వహిస్తున్నామని వివరించారు.

ఈరోడ్ ఈస్ట్ ఉపఎన్నిక

డీఎంకే, ఎన్టీకే అభ్యర్థుల నామినేషన్లు ఓకే

- 10 మంది స్వతంత్రుల ఉపసంహరణ

చెన్నై, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ తూర్పు శాసనసభ నియోజకవర్గ ఉప ఎన్నికలో డీఎంకే అభ్యర్థి చంద్రకుమార్, నామ్ తమిళర్ కట్చి అభ్యర్థి సీతాలక్ష్మి నామినేషన్లు సక్రమంగా ఉన్నట్లు ఎన్నికల అధికారి మనీష్ ప్రకటించారు. శనివారం అభ్యర్థుల నామినేషన్ల పరిశీలన జరిగిందన్నారు., మొత్తం 65 మంది నామినేషన్లు దాఖలు చేశారని, వారిలో 10 మంది నామినేషన్లు ఉప సంహరించుకున్నారన్నారు. ప్రస్తుతం 55 నామినేషన్లను ఆమోదించామని తెలిపారు. సోమవారం నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియనుందని, అదే రోజు సాయంత్రం అభ్యర్థుల తుది జాబితాను వెల్లడిస్తామని ఆయన పేర్కొన్నారు.

విజయ్ పరందూరు పర్యటనకు ముందస్తు ఏర్పాట్లు

- గ్రామస్తులతో బుస్సీ ఆనంద్ చర్చలు



ఆందోళనకారులతో చర్చిస్తున్న టీవీకే ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్

టి.నగర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): కాంచీపురం సమీపం పరందూరులో రెండో విమానాశ్రయ ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ సుదీర్ఘ పోరాటం సాగిస్తున్న 13 గ్రామాల ప్రజలను తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత, నటుడు విజయ్ కలుసుకోనున్నారు. ఆ మేరకు ఈ నెల 20న ఆయన పరందూరు సహా 13 గ్రామాల్లో పర్యటించనున్నారు. ఆ పర్యటనకు తగు ఏర్పాట్లు చేపట్టే విషయమై టీవీకే ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ విమానాశ్రయ ప్రాజెక్టు వ్యతిరేక సంఘాల నాయకులతో చర్చించారు. టీవీకే తొలి మహానాడులోనే పరందూరు విమానాశ్రయ ప్రాజెక్టును తమ పార్టీ వ్యతిరేకిస్తుందని విజయ్ ప్రకటించిన విషయాన్ని ఆందోళనకారుల వద్ద ఆయన ప్రస్తావించారు. విమానాశ్రయ ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ సమైక్య ఉద్యమం నిర్వహిస్తున్న 13 గ్రామాల ప్రజలను విజయ్ నేరుగా కలుసుకుని పార్టీ తరపున మద్దతు ప్రకటించనున్నారని ఆనంద్ తెలిపారు. విజయ్ పర్యటనకు అనుమతినిచ్చి గట్టి భద్రతా ఏర్పాట్లు చేపట్టమని కోరుతూ ఇదివరకే పోలీసు ఉన్న తాధికారులకు వినతి పత్రం సమర్పించామని ఆయన చెప్పారు. ఆ తర్వాత ఆయన విమానాశ్రయం ఏర్పాటు కానున్న ప్రాంతాన్ని కూడా పరిశీలించారు. ఏకనాపురం అంబేడ్కర్ విగ్రహం కూడలి వద్ద ఉద్యమకారులతో భేటీ కానుండటంతో ఆ ప్రాంతం వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్లపై స్థానిక ప్రజలతో ఆయన చర్చలు జరిపారు.

పోలీసుల అనుమతి జారీ..

వివాదాస్పదమైన పరందూరు ప్రాంతంలో బయటి వ్యక్తులుగానీ, ఇతర ప్రాంతాలకు చెందిన రాజకీయ పార్టీల నేతలను గానీ ప్రవేశించకుండా పోలీసులు నిషేధం అమలు చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో టీవీకే అధినేత విజయ్‌ని కూడా పరందూరులో అడుగుపెట్టనీయకుండా పోలీసులు అడ్డుకుంటారని అందరూ భావించారు. అయితే శనివారం ఉదయం విజయ్ పరందూరు పర్యటనకు అనుమతి జారీ చేస్తూ పోలీసులు శాఖ ఉత్తర్వు జారీ చేసింది. ఈ నేపథ్యంలో విజయ్ ఈ నెల 20న పరందూరులో పర్యటిస్తారని బుస్సీ ఆనంద్ తెలిపారు. పరందూరు ఉద్యమకారులందరినీ సమావేశపరచి, విజయ్ వారితో చర్చలు జరుపనున్నారని పేర్కొన్నారు.

రెండు వర్గాల మధ్య ఘర్షణ

- పెరంబలూరు జిల్లాలో యువకుడి మృతి

ప్యారీస్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పెరంబలూరు జిల్లాలో రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఓ యువకుడు మృతి చెందాడు. పెరంబలూరు సమీపంలోని వేప్పంతట్టై మండలం కైకలత్తూరులో దళిత కుటుంబానికి చెందిన అరుణ్ (32), అదే ఊరిలో వరికోత యంత్రం డ్రైవర్‌గా పని చేసే మణికంఠన్ (31) స్నేహితులు. అయితే మనస్పర్థల కారణంగా వీరి మధ్య గత కొన్ని నెలలుగా మాటల్లేవు. ఈ క్రమంలో ఇటీవల సంక్రాంతి సందర్భంగా వారి గ్రామంలో నిర్వహించిన ఓ పోటీలో గొడవ ఘర్షణకు దారి తీసింది. ఈ నేపథ్యంలో గ్రామస్తులు రెండు వర్గాలుగా విడిపోయి ఒకరిపై ఒకరు కర్రలతో దాడి చేసుకున్నారు. చివరికి ఆ గొడవల్లో అరుణ్, మణికంఠన్ తలపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని గ్రామస్తులను చెదరగొట్టారు. శుక్రవారం రాత్రి పోలీసులు గ్రామ పెద్దలతో మాట్లాడుతున్న సమయంలో మణికంఠన్ హఠాత్తుగా అరుణ్‌పై కొడవలితో దాడికి పాల్పడ్డాడు. దీంతో తీవ్రంగా గాయపడిన అరుణ్‌ను స్థానికులు ఆస్పత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యంలో కన్నుమూశాడు. మణికంఠన్‌ను పోలీసులు అరెస్టు చేశారు.

కోళ్లఫారంలో అగ్నిప్రమాదం

- రూ.15లక్షల ఆస్తినష్టం



మంటలలో దగ్ధమవుతున్న కోళ్ల ఫారం

టి.నగర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ సమీపం విల్లారసంపట్టి జేజే నగర్‌లో బాలసుబ్రమణికి నడుపుతున్న కోళ్లఫారంలో శనివారం వేకువజాము షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ సంఘటనలో 5వేలకు పైగా కోళ్లు మృతి చెందాయి. ఈ సమాచారం అందుకున్న అగ్నిమాపక దళం సభ్యులు ఫైరింజన్‌తో హుటాహుటిన అక్కడికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో రెండు రేకుల పైకప్పు కలిగిన కోళ్లఫారం, సామగ్రి, దాణా, ఫర్నిచర్ కాలిబూడిదై రూ.15లక్షల మేరకు నష్టం వాటిల్లినట్లు పోలీసులు అంచనా వేశారు. ఈ సంఘటనపై వీరప్పన్‌సత్రం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

తిరుప్పూరులో మూడు కార్ల దగ్ధం



దగ్ధమైన కార్లను పరిశీలిస్తున్న కార్ల విక్రయ కేంద్రం నిర్వాహకులు

చెన్నై, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూరు గోల్డెన్‌నగర్ ప్రాంతంలో నిలిపి ఉంచిన మూడు కార్లు శనివారం వేకువజామున దగ్ధమయ్యాయి. ఆ ప్రాంతంలో గోకుల కన్నన్ కార్ల విక్రయ కేంద్రం నడుపుతున్నాడు. శుక్రవారం సాయంత్రం తన ఇంటిముందు మూడు కార్లను పార్కింగ్ చేశాడు. వేకువజామున ఉన్నట్టుంటి ఆ మూడు కార్లలో నిప్పులు చెలరేగాయి. ఆ సందర్భంగా శబ్దాలకు గోకులకన్నన్ నిద్రలేచి వెలుపలికు వచ్చి చూడగా ఆ కార్లు ముప్పావు శాతం దాకా దగ్ధమయ్యాయి. వెంటనే ఆయన పోలీసులకు, అగ్నిమాపక దళం అధికారులకు ఫిర్యాదు చేశారు. అగ్నిమాపక దళం సభ్యులు ఫైరింజన్‌తో వెళ్ళి మంటలను ఆర్పివేశారు. వ్యాపారంలో పోటీ కారణంగా ప్రత్యర్థులెవరైనా ఆ కార్లకు నిప్పంటిచి ఉండవచ్చునని పోలీసులు అనుమానిస్తున్నారు. దగ్ధమైన కార్ల విలువ రూ.20లక్షలని పోలీసులు అంచనా వేశారు. తిరుప్పూర్ నార్త్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, అక్కడి సీసీ కెమెరాల్లో నమోదైన వీడియో దృశ్యాల ఆధారంగా దర్యాప్తు జరుపుతున్నారు.

తిరుత్తణి వద్ద వింటేజ్ కారు స్వాధీనం



తిరుత్తణి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ నటుడు జయం రవి నటించిన 'బ్రదర్స్'లో వున్న వింటేజ్ కారును తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి సమీపంలో చెక్‌పోస్టు వద్ద అధికారులు స్వాధీనం చేసుకున్నారు. శనివారం ఉదయం చెక్‌పోస్టు వద్దకు వచ్చిన వాహనాన్ని ఆపిన రవాణాశాఖాధికారులు.. దానికి సంబంధించిన పత్రాలు చూపించాలని అడిగారు. దీంతో కారు డ్రైవర్ మణి.. ఆ వాహనం బ్రదర్స్‌లో ఉపయోగించారని, దానిని తాను తిరుపతికి తీసుకెళ్తున్నానని తెలిపాడు. అయితే ఆ వాహనానికి సంబంధించిన పత్రాలేవీ తన వద్ద లేవని పేర్కొన్నాడు. దీంతో అధికారులు ఆ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

తిరుచెందూరు ఆలయం వద్ద కడలికోత

- ఐఐటీ నిపుణుల సహకారంతో శాశ్వత పరిష్కారం
- ఎంపీ కనిమొళి



కోతకు గురైన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కనిమొళి, మంత్రులు శేఖర్‌బాబు, అనితా రాధాకృష్ణన్

చెన్నై, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): సుప్రసిద్ధ శైవక్షేత్రం తిరుచెందూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి ఆలయం వద్ద తరచూ ఏర్పడుతున్న కడలి కోత నిరోధానికి ఐఐటీ నిపుణుల సహకారంతో శాశ్వత పరిష్కారం కల్పించనున్నట్లు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు తెలిపారు. ఆ ఆలయం సమీపంలో గత కొన్నేళ్లుగా ప్రత్యేకించి సునామీ ఉపద్రవం సంభవించినప్పటి నుంచీ సముద్రతీరం తరచూ వెనక్కి మళ్లుతోంది. కొన్ని సందర్భాల్లో ఏడు అడుగుల నుంచి 10 అడుగుల లోతున తీరంలో కడలి కోత ఏర్పడుతోంది. దీంతో ఆ ఆలయానికి ముప్పు వాటిల్లుతుందేమోనని భక్తులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో ఆ ఆలయం వద్ద సముద్రతీరంలో కడలికోతను నిరోధించేందుకు చర్యలు చేపట్టే నిమిత్తం తూత్తుకుడి ఎంపీ కనిమొళి, మంత్రులు పీకే శేఖర్‌బాబు, అనితా రాధాకృష్ణన్, జిల్లా కలెక్టర్ ఇలమ్‌భగవత్ శనివారం ఉదయం కడలి కోత ప్రాంతాలను పరిశీలించారు. ఆ సందర్భంగా కనిమొళి విలేకరులతో మాట్లాడుతూ ... వాతావరణంలో వింతమార్పుల కారణంగా ఈ ఆలయం సమీపంలోని సముద్రతీరం వెనక్కి మళ్లడం, తరచూ తీర ప్రాంతం కడలి కోతకు గురి అవుతోందని చెప్పారు. ఈ పరిస్థితుల్లో ఆలయం వెనుకవైపున సముద్రతీరం పొడవునా కడలి కోతను నిరోధించేందుకు ఐఐటీ నిపుణుల చేత పరిశీలన చేయించనున్నామని, ఆ తర్వాత ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళి ప్రత్యేక నిధులు మంజూరు చేయించి సముద్రం వల్ల ఆలయానికి ఎలాంటి ముప్పు వాటిల్లని విధంగా శాశ్వతంగా అడ్డుగోడ నిర్మించడం లేదా సిమెంట్ దిమ్మెలను పరచటం వంటి పనులు చేపడతామని చెప్పారు. కనిమొళితోపాటు దేవాదాయ శాఖ కార్యదర్శి చంద్రమోహన్, కమిషనర్ శ్రీధర్, అడిషనల్ కమిషనర్ సుకుమారన్, తిరుచెందూరు మేయర్ జగన్ పెరియసామి, జిల్లా ఎస్పీ ఆల్బర్ట్ జాన్, జిల్లా పంచాయతీ యూనియన్ అధ్యక్షుడు బ్రహ్మశక్తి, చీఫ్ ఇంజనీర్ పెరియసామి, తిరుచెందూరు ఆలయ డిప్యూటీ కమిషనర్ జ్ఞానశేఖరన్, ఐఐటీ ప్రొఫెసర్ సన్యాసిరాజు, మత్స్య శాఖ డిప్యూటీ డైరెక్టర్ చంద్రా, అసిస్టెంట్ డైరెక్టర్ పుష్పా సర్గుణం తదితరులు పర్యటించారు.

నిమిషాల వ్యవధిలో

ఇద్దరు రౌడీల హత్య

హంతకుల కోసం ప్రత్యేక పోలీసులు బృందాలు

చెన్నై, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆవడి, పట్టాభిరాం పోలీస్ స్టేషన్ల పరిధిలో ఇద్దరు రౌడీలు హత్యకు గురయ్యారు. పట్టాభిరాం పక్కన ఉన్న ఆయిల్‌షేరి ప్రాంతానికి చెందిన రెట్టైమలై శ్రీనివాసన్, ఆయన తమ్ముడు స్టాలిన్ నిమిషాల వ్యవధిలో హత్యకు గురయ్యారు. గుర్తు తెలియని వ్యక్తులు శ్రీనివాసన్‌పై పట్టాభిరాంలో, అతని సోదరుడు స్టాలిన్‌పై ఆవడిలో మారణాయుధాలతో దాడి చేశారు. ఈ ఘటనల్లో తీవ్రంగా గాయపడిన సోదరులు సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. దీంతో ఆయా ప్రాంతాల్లో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాలకు చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. కాగా శ్రీనివాసన్, స్టాలిన్‌పై గతంలో పలు హత్య, బెదిరింపు, దాడి కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. పాత కక్షలే ఈ హత్యలకు కారణంగా పోలీసులు భావిస్తున్నారు. హంతకుల కోసం ప్రత్యేక పోలీసు బృందాలు ఏర్పాటయ్యాయి.

SUNDAY SPECIAL

ఏనుగులకు హానిచేసే మొక్కలతో అందమైన 'గజ' రూపాలు



ప్రాచీన కాలం నుంచి నేటి ఏఐ (కృత్రిమ మేధోపరిజ్ఞాన) యుగం దాకా గిరిజనులకు, హస్తకళలకు మధ్య అవినాభావ సంబంధం ఉంది. వెదురు ముక్కలతో, కొబ్బరి నారతో, చివరకు మట్టితో అద్భుతమైన కళాకృతులను సృష్టించగల హస్తవాసి వారికి ఉందనడం అతిశయోక్తి కాదు. రాష్ట్రంలోని నీలగిరి జిల్లా కున్నూరు, ముదుమలై అటవీ ప్రాంతాలను ఆనుకుని నివసించే ఈ గిరిజనుల పర్యావరణానికి, ప్రత్యేకించి అడవి ఏనుగులకు హాని కలుగని రీతిలో కొండ ప్రాంతాల్లో లభించే కలుపు మొక్కలు, దంటు మొక్కలను ఉపయోగించి ఆట వస్తువులను, చిన్న పిల్లలు ఆటలాడుకునే కొయ్య బొమ్మలు, కట్టె దువ్వెనలు, కుంకుమ భరిణెలు తయారు చేస్తుంటారు. ఇప్పటి దాకా చిన్న చిన్న వస్తువులనే తయారు చేసిన ఆ గిరిజనులు ప్రస్తుతం విదేశాలకు ఎగుమతి చేయగల అందమైన అతిపెద్ద కళాకృతులను రూపొందిస్తున్నారు.

\- చెన్నై, ఆంధ్రజ్యోతి

- గూడలూరు, ముదుమలై గిరిజనుల అద్భుత సృష్టి
- న్యూయార్క్, లండన్‌కు ఆగమేఘాలపై పయనం

చూపరులకు వింత గొలుపుతున్న పెద్ద ఏనుగులు, గున్నఏనుగుల బొమ్మలు



న్యూయార్క్ నగర వీధిలో 'కున్నూరు ఏనుగు' బొమ్మలు

లాంటానా మొక్కలతో...

నీలగిరిజిల్లా అడవులలో సంచరించే ఏనుగులు వలస పోవటానికి, అనారోగ్యం చెందటానికి ప్రధాన కారణమైన 'లాంటనా' అనే ముళ్ల మొక్కలను ఉపయోగించి ఏనుగు రూపాలను తయారు చేసి తమ ప్రావీణ్యాన్ని దేశవిదేశాల్లో ఎలుగెత్తి చాటుతున్నారు. తమ ప్రతిభాపాటవాలకు అంతర్జాతీయ స్థాయి గుర్తింపును కూడా పొందుతున్నారు. ఈ గిరిజనులు తయారు చేస్తున్న ఏనుగు రూపాలు విమానాల్లో, ఓడల్లో విదేశాలకు ఎగుమతి అవుతుండటం విశేషం.ఈ అందమైన గజ రూపాలకు అంతర్జాతీయ మార్కెట్‌లోనూ మంచి డిమాండ్ ఉండడమే ఇందుకు నిదర్శనం.

తలకు మించిన భారం...

నీలగిరి అడవులలో ఎక్కువ విస్తీర్ణంలో ఆక్రమించుకుని ఉన్న ఈ 'లాంటానా' రకం ముళ్ల మొక్కలను తొలగించడం అటవీ శాఖాధికారులకు తలకుమించిన భారంగా ఉంటోంది. ఆ మొక్కలను యంత్రాలతో పెకలించినా తొలగించిన చోట మళ్లీ ప్రత్యక్షమవుతుంటాయి. ఈ పరిస్థితులలోనే అటవీశాఖ అధికారులు ఓ ప్రైవేటు సంస్థ సహకారంతో ఆ మొక్కలను తొలగించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు.

తగ్గుతున్న మొక్కల వ్యాప్తి...

ఈ ఏనుగు బొమ్మల తయారీకి ఊతమిస్తున్న ప్రైవేటు సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ ఏనుగులకు హాని కలిగించే మొక్కలతోనే ఏనుగు బొమ్మలు తయారు చేయడం చాలా అరుదైన విషయమని చెప్పారు. ఏనుగు బొమ్మల తయారీ వల్ల కున్నూరు, ముదుమలై అటవీ ప్రాంతాల్లో 'లాంటానా' మొక్కల వ్యాప్తి బాగా తగ్గిందన్నారు. అడవులలో సంచరిస్తున్న ఏనుగులను ఫొటో తీసి వాటి ఆధారంగానే ఈ బొమ్మలను గిరిజనులు రూపొందిస్తున్నారని తెలిపారు. అటు అడవి ఏనుగులు, ఇటు గిరిజనుల సంరక్షణకు ఈ ఏనుగు బొమ్మల తయారీ దోహదపడుతుండటం తమకెంతో ఆనందంగా ఉందని ఆయన చెప్పారు. ఈ ప్రాంతంలో తయారవుతున్న ఏనుగు బొమ్మలతో పలు నగరాల్లో ప్రదర్శనలు కూడా నిర్వహించినట్లు తెలిపారు. ఆ మధ్య బెంగళూరులో నిర్వహించిన ప్రదర్శనలో ఈ ఏనుగుల బొమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయని ఆయన వివరించారు.



ఏనుగు బొమ్మకు వార్నిష్ వేస్తున్న కళాకారుడు

బొమ్మల తయారీ...

ఏనుగుల పాలిట శాపంగా మారిన 'లాంటానా' ముళ్ల మొక్కల ద్వారా అందమైన ఏనుగు బొమ్మలను తయారు చేస్తున్నారు. ముదుమలై, గూడలూరు రహదారులకు చేరువగా ఉన్న ఈ 'లాంటానా' మొక్కలను సేకరించి తొరాపల్లి అనే గిరిజన గ్రామం వద్ద గున్న ఏనుగు, పెద్ద ఏనుగు బొమ్మలను తయారు చేస్తున్నారు. ఈ ఏనుగు బొమ్మల తయారీ వల్ల అక్కడి గిరిజనులకు యేడాది పొడవునా చేతి నిండా పని దొరకడమే కాకుండా ఆర్థిక స్థోమతను కూడా పెంచుకోగలుగుతున్నారు. పెట్టకురుంబర్, పనియర్, కాట్టునాయక్కర్, సోలికా అని పిలువబడే ఈ గిరిజన కులాలకు చెందిన సుమారు 200 మంది హస్తకళాకారులు ఈ ఏనుగు బొమ్మల తయారీలో నిష్ణాతులు. ఈ కళాకారులు తయారు చేసిన అందమైన ఏనుగు బొమ్మలు ఇంగ్లండ్‌కు ఎగుమతి అయ్యాయి. ఇటీవల నీలగిరి జిల్లా నుంచి సుమారు 50కిపైగా భారీ సైజు ఏనుగు బొమ్మలు అమెరికాలోని న్యూయార్క్ మ్యూజియంకు ఎగుమతి చేశారు. అలాగే ఆ నగరంలోని ప్రధాన వీధుల్లో మినీ సైజు పార్కుల మధ్య ఈ ఏనుగు బొమ్మలను అమర్చారు. ప్రస్తుతం లండన్, న్యూయార్క్ నగరం ప్రధాన రహదారుల్లో ఉన్న ఈ ఏనుగుల బొమ్మలు టాక్ ఆఫ్ ద సిటీగా మారింది. ఆ ఏనుగు బొమ్మల అందానికి ఆ రెండు నగరాలలోని ఆంగ్లేయులు, అమెరికన్లు ఫిదా అవుతున్నారు.



జంతు ప్రేమికులకు కనువిందు చేసిన డాగ్‌షో

- వింతవిన్యాసాలతో అలరించిన శునకాలు





చెన్నై, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): చెన్నైలో శనివారం ఉదయం ప్రారంభమైన డాగ్‌షోలో విదేశీ, స్వదేశీ జాతులకు చెందిన శునకాలు వింత విన్యాసాలతో నగరవాసులను ఆకట్టుకున్నాయి. నగరంలోని జంతు పోషకులను ప్రోత్సహించే దిశగా ఈ డాగ్‌షోను ఏర్పాటు చేశారు. జంతు ప్రేమికులు తాము అల్లారు ముద్దుగా పెంచుకుంటున్న శునకాలను అందంగా అలంకరించి మరీ ఈ షోలో పాలుపంచుకునేలా చేశారు. మైలాపూరు లైట్‌హౌస్ సమీపంలోని పెట్స్ స్కూలు క్రికెట్ మైదానంలో ఈ డాగ్‌షోను నిర్వహించారు. రెండు రోజులపాటు జరిగే ప్రదర్శనలో తొలి రోజు యజమానుల ఆజ్ఞలకు శిరసావహించడం, దాచిన వస్తువులను అన్వేషించి వెలికి తీయడం అనే రెండు అంశాలపై ఈ శునకాల పోటీలు జరిపారు. అదే విధంగా అందాల పోటీలు కూడా నిర్వహించారు. చిన్న సైజు జడలబర్రెను తలపించేలా విదేశీ శునకాలు, ఒళ్లంతా నలుపు తెలుపు రంగులతో దట్టమైన వెంట్రుకలు కలిగిన శునకాలు, ముఖం నుంచి పాదాల దాకా గోధుమ రంగు వెంట్రుకలు కలిగిన బుల్లి సైజు శునకాలు, ఒంటిని పూర్తిగా స్వెటర్ వేసుకున్నట్లు మృదువైన ముదురు గోధుమ రంగు వెంట్రుకలు కలిగిన చిన్న సైజు శునకాలు, గోధుమ రంగు, తెలుపు రంగు కలబోసినట్లు గుబురు వెంట్రుకలున్న శునకాలు, ఇక స్వదేశీ జాతికి చెందిన శునకాలు పాల్గొని తమ ప్రతిభాపాటవాలను ప్రదర్శించాయి. వాద్య సంగీతానికి తగ్గట్లు డాన్స్ చేసి మరీ అందరినీ ఆకట్టుకున్నాయి.



సూరి హీరోగా 'మామన్' ఫస్ట్‌లుక్ రిలీజ్



'మామన్' ఫస్ట్‌లుక్

'విలంగు'తో విజయవంతమైన వెబ్ సిరీస్‌ను రూపొందించిన దర్శకుడు ప్రశాంత్ పాండిరాజ్ దర్శకత్వంలో హీరో సూరి 'మామన్'గా కనిపించనున్నారు. ఈ మూవీ ఫస్ట్‌లుక్‌ను తాజాగా విడుదల చేశారు. సీనియర్ నటుడు రాజ్‌కిరణ్, ఐశ్వర్య లక్ష్మి, శ్వాసిక, జయప్రకాష్, బాబా భాస్కర్, వీజీ చంద్రశేఖర్, బాల శరవణన్, గీతా కైలాసం, నిఖిలా శంకర్ తదితరులు ఇతర పాత్రల్లో నటించారు.దినేష్ పురుషోత్తమన్ ఛాయాగ్రహణం అందించే ఈ చిత్రానికి హేషాం అబ్దుల్ వహాబ్ సంగీతం. లార్క్ స్టూడియోస్ పతాకంపై నిర్మాత కె.కుమార్ నిర్మిస్తున్నారు. ఈ మూవీ వివరాలను దర్శకుడు వివరిస్తూ, 'ఆరేళ్ల బాలుడుకు అతని మేనమామకు ఉన్న బంధాన్ని హ్యూమన్ ఎమోషనల్‌లో వివరించే చిత్రం. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేలా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిస్తున్నాం. తిరుచ్చి, చుట్టుపక్కల ప్రాంతాల్లో షూటింగ్ జరుపుతున్నాం. సమ్మర్ స్పెషల్‌గా విడుదల చేసేందుకు సన్నాహాలు చేశాం' అని చెప్పారు. ఇదిలావుండగా, హీరో సూరి వరుస హిట్లను తన ఖాతాలో వేసుకుంటున్నారు. గత యేడాది వచ్చిన 'గరుడన్', 'విడుదలై-2'లు విజయం సాధించిన విషయం తెల్సిందే.

ఆయన దర్శకత్వంలో నటించడం మంచి మందుతో సమానం : విశాల్

తమిళ చిత్రజ్యోతి



'మద గజ రాజా' థ్యాంక్స్ గివింగ్ మీట్

సుందర్ సి దర్శకత్వంలో నటించడం మంచి మెడిసన్‌తో సమానమని హీరో విశాల్ అన్నారు. తాను వైద్యుడి వద్దకు వెళ్లేందుకు సంకోచిస్తానని, కానీ, సుందర్ దర్శకత్వంలో నటించడమంటే మానసికంగా, ఆరోగ్యపరంగా తనలో తనకు తెలియకుండానే ఎక్కడ లేని హుషారు వస్తుందన్నారు. జెమిని ఫిల్మ్ సర్క్యూట్ పతాకంపై సుందర్ సి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'మద గజ రాజా' (ఎంజీఆర్). చిత్రీకరణ పూర్తి చేసుకుని 12 యేళ్ల తర్వాత పొంగల్ సందర్భంగా విడుదలై బ్లాక్‌బస్టర్ విజయాన్ని సొంతం చేసుకుంది. దీన్ని పురస్కరించుకుని నగరంలో థ్యాంక్స్ గివింగ్ మీట్‌ను నిర్వహించగా, ఇందులో హీరో విశాల్, హీరోయిన్ అంజలి, సంగీత దర్శకుడు విజయ్ ఆంటోని, దర్శకుడు సుందర్ సి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశాల్ మాట్లాడుతూ... 'ఈ చిత్రం ప్రీరిలీజ్ ఈవెంట్ జరిగిన సమయంలో నేను 103 డిగ్రీల జ్వరంతో బాధపడుతున్నా. ఒక హీరోగా ఆ వేడుకలో పాల్గొనాల్సిన బాధ్యత నాది. కానీ, సోషల్ మీడియాలో ఎన్నో కథలు అల్లేశారు. నిజాలు తెలుసుకుని వాస్తవాలను రాయాలని కోరుతున్నా. ఒక దర్శకుడు 30 యేళ్లుగా చిత్రపరిశ్రమలో కొనసాగడం అంటే సాధారణ విషయం కాదు. చిత్ర నిర్మాత మనోహరన్‌తో నాకు ఫ్యామిలీ రిలేషన్ ఉంది. దివంగత నటుడు ఎంజీఆర్ పైలోకం నుంచి మా బృందాన్ని ఆశీర్వదిస్తున్నారు. అందుకే ఇంత భారీ విజయాన్ని సొంతం చేసుకుని, ఎంజాయ్ చేస్తున్నాం' అన్నారు. దర్శకుడు సుందర్ సి మాట్లాడుతూ... 'ఒక చిత్రం 12 యేళ్ల తర్వాత విడుదలవుతోంది, ఏం విజయం సాధిస్తుందంటూ పలువురు వ్యాఖ్యానించారు. కానీ, ఫలితాన్ని ఇచ్చేది ప్రేక్షక దేవుళ్ల మాత్రమే. వారు అద్భుతమైన తీర్పునిచ్చారు. ఈ సినిమా విడుదలకు సహకరించిన తిరుపూరు సుబ్రహ్మణ్యం, ఏసీ షణ్ముగం, ఏసీఎస్ అరుణ్ కుమార్ తదితరులకు ప్రత్యేక ధన్యవాదాలు' అన్నారు. కాగా, ఈ మూవీలో విశాల్, సంతానం, అంజలి, వరలక్ష్మి శరత్‌కుమార్ ప్రధాన పాత్రలు పోషించారు.

వెనక్కి తగ్గిన 'ఎన్ఈఈకే'

హీరో ధనుష్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'నిలవుక్కు ఎన్‌మేల్ ఎన్నడి కోబమ్'(ఎన్ఈఈకే) చిత్రాన్ని వచ్చే నెల 21న విడుదల చేయనున్నట్టు నిర్మాతలు ప్రకటించారు. 'రాయన్' మూవీ తర్వాత హీరో ధనుష్ దర్శకత్వం వహిస్తూ సొంతంగా ఈ సినిమాను నిర్మించారు. ఇందులో హీరోగా ధనుష్ అక్క కుమారుడు పవిష్ పరిచయమవుతున్నారు. హీరోయిన్లుగా అనైక సురేంద్రన్, మ్యాథ్యూ థామస్, ప్రియాప్రకాష్ వారియర్ నటించగా, సీనియర్ నటుడు శరత్‌కుమార్ కీలక పాత్రను పోషించారు. జీవీ ప్రకాష్‌కుమార్ సంగీతం. వండర్ బార్ ఫిలిమ్స్, ఆర్‌కే ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. నిజానికి ఫిబ్రవరి 7వ తేదీన విడుదల చేయాలని తొలుత ప్లాన్ చేశారు. కానీ, అగ్రహీరో అజిత్‌కుమార్ నటించిన 'విడాముయర్చి'ని ఫిబ్రవరి 6న విడుదల చేయనున్నట్టు లైకా ప్రొడక్షన్స్ ప్రకటించింది. దీంతో 'ఎన్ఈఈకే' మూవీని అదే నెల 21వ తేదీకి వాయిదా వేశారు. ఈ చిత్రాన్ని రెడ్ జెయింట్ మూవీస్ రిలీజ్ చేయనుంది.



'ఎన్ఈఈకే'లో ఓ దృశ్యం

విజయ్ చిత్రంలో 'విరుమాండి' అభిరామికి అవకాశం



అభిరామి

అగ్రహీరో విజయ్ నటించే తన చివరి చిత్రం 'విజయ్ 69'లో 'విరుమాండి' అభిరామికి అవకాశం వరించింది. హెచ్.వినోద్ దర్శకత్వంలో ఈ మూవీ తెరకెక్కుతుంది. బాబీ డియోల్, పూజా హెగ్డే, మమితా బైజు, గౌతం వాసుదేవ్ మేనన్, ప్రకాష్‌రాజ్, వరలక్ష్మి శరత్‌కుమార్, డీజే అరుణాచలం తదితరులు నటిస్తున్నారు. కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై రూపొందే ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతం. పొలిటికల్ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిస్తున్నారు. చిత్రీకరణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇందులో మరో కీలక పాత్రలో నటించేందుకు గత యేడాది 'మహారాజా', 'వేట్టైయన్' వంటి హిట్ చిత్రాల్లో నటించిన అభిరామిని ఎంపిక చేశారు.

దర్శక నిర్మాత జయమురుగన్ ఆకస్మిక మృతి



జయమురుగన్ (ఫైల్‌ఫొటో)

అడయార్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ దర్శకుడు, నిర్మాత జయమురుగన్ ఆకస్మికంగా మృతి చెందారు. శుక్రవారం రాత్రి గుండెపోటుకు గురైన ఆయన తుదిశ్వాస విడిచారు. 1995లో మన్సూర్ అలీఖాన్ హీరోగా 'సింధుబాద్'ని తెరకెక్కించారు. ఆ తర్వాత పాండ్యరాజన్ - కనక జంటగా నటించిన 'పురుషన్ ఎనక్కు అరసన్' అనే మూవీని నిర్మించారు. ఈ చిత్రాల విజయంతో 'రోజామలరే', 'అడడా ఎన్న అళగు', 'తీ ఇవన్' వంటి చిత్రాలను స్వీయనిర్మాణ దర్శకత్వంలో రూపొందించారు. ఒక వైపు నిర్మాతగా, మరోవైపు దర్శకుడుగా రాణిస్తూ వచ్చిన జయమురుగన్.. తన కుటుంబ సభ్యులతో తిరుపూరులో నివసిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి ఆయనకు ఉన్నట్టుండి గుండె నొప్పి రావడంతో తిరుపూరులోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందారు. శనివారం అంత్యక్రియలు పూర్తి చేశారు. జయమురుగన్ ఆకస్మిక మృతిపై పలువురు సినీ ప్రముఖులు దిగ్భ్రాంతితో పాటు తమ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

గాయక దంపతులకు సత్కారం

వేలూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): వేలూరు సమీపంలోని నారాయణిపీఠంలో శ్రీ నారాయణి గ్రూపు సంస్థల ఆధ్వర్యంలో శనివారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రముఖ జానపద గాయకులు సెంథిల్-రాజ్యలక్ష్మి దంపతులకు సత్కార కార్యక్రమం జరిగింది. నారాయణి గ్రూప్స్ డైరెక్టర్ డాక్టర్ బాలాజి నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ గీతా ఇనియన్, పారామెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ మాధవి, డివైన్ అండ్ సుగి గ్రూప్ జాయింట్ డైరెక్టర్లు శ్రీనాథ్, శ్రీకాంత్ కూడా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు, ఆసుపత్రి సిబ్బంది కూడా హాజరయ్యారు.



ఎన్టీఆర్‌కు ఘన నివాళి

ప్యారీస్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని తెలుగుదేశం పార్టీ (టీడీపీ) నార్త్ చెన్నై విభాగం ఆధ్వర్యంలో శనివారం టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ 29వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులర్పించారు. స్థానిక బ్రాడ్‌వే వరదముత్తియప్పన్ వీధిలోని కార్యాలయంలో టీడీపీ నార్త్ చెన్నై విభాగం అధ్యక్షుడు ఎం.మోహన్‌బాబు అధ్యక్షతన ఎన్టీఆర్ చిత్రపటానికి కార్యకర్తలు పూలు చల్లి నివాళులర్పించారు.ఈ సందర్భంగా మోహన్‌బాబు మాట్లాడుతూ...దేశ రాజకీయాల్లో సమర్థుడైన రాజనీతిజ్ఞుడుగా పేరు సంపాదించిన ఎన్టీఆర్‌కు అత్యున్నత భారతరత్నను ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పొక్కాళి బాలాజీ, కె.బుజ్జయ్య, వి.హనుమంతు, జె.శ్రీనివాసులు, పి.ప్రకాశ్, మనోహర్, సుబ్బారెడ్డి, గుణశేఖర్, బి.వెంకటసుబ్బయ్య, కొక్కు జగన్, ఆకుల చంద్రశేఖర్, కె.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కార్యకర్తలు

తిరుచ్చిలో జల్లికట్టు

- రంకెలేసిన గిత్తలు



ప్యారీస్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి సమీపంలోని నవలూర్ కుట్టపట్టీలో పొంగల్ సందర్భంగా ఆదివారం జల్లికట్టు పోటీలను అట్టహాసంగా నిర్వహించారు. ఉదయం 8.40 గంటలకు ఎమ్మెల్యే పళనియాండి, ఆర్డీవో శ్రీనివాసన్ జెండా ఊపి పోటీలను ప్రారంభించారు. మదురై, దిండుగల్, పుదుకోట, తిరుచ్చి, కరూర్, సేలం, తంజావూర్, శివగంగా తదితర జిల్లాల నుండి సుమారు 600కు పైగా ఎద్దులు, 400 మంది వీరులు పాల్గొన్నారు. ముందుగా ఆలయ ఎద్దును బరిలోకి దించారు. సాయంత్రం 5 గంటల వరకు పలు రౌండ్లుగా సాగిన ఈ పోటీల్లో మైదానంలో రంకెలేస్తూ ఉరకలెత్తిన ఎద్దులను ఆదుపు చేసే ప్రయత్నంలో ఆరుగురు యువకులకు స్వల్ప గాయాలయ్యాయి. పోటీల్లో ఎవరికి పట్టుబడని ఎద్దుల యజమానులు, పోట్లగిత్తలను అదుపు చేసిన వీరులకు బంగారు, వెండి, ఫ్రిడ్జ్, టీవీ, మోటరు సైకిల్ తదితర పలు రకాల బహుమతులు అందించారు. అదే విధంగా పుదుకోట జిల్లా మండయూర్ గ్రామంలోని మురుగన్ ఆలయ ప్రాంగణంలో పొంగల్ వేడుకలు పురస్కరించుకొని శనివారం నిర్వహించిన జల్లికట్టులో 700 పైగా ఎద్దులు,300మంది యువకులు పాల్గొన్నారు. పశు సంవర్థక శాఖ వైద్య పరీక్షల అనంతరం ఉదయం 9 గంటలకు ముందుగా మురుగన్ ఆలయ ఎద్దులు బరిలోకి దించగా, అది ఎవరికి చిక్కకుండా విజేతగా నిలిచింది.

ఆదర్శ పురుషుడు 'ఎన్టీఆర్'

- వర్ధంతి సభలో వక్తలు

ప్యారీస్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): సినీ, రాజకీయ రంగాల్లో రాణించి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిన తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, ఉభయ తెలుగు రాష్ట్రాల మాజీ సీఎం ఎన్టీఆర్ ఆదర్శ పురుషుడని పలువురు వక్తలు కొనియాడారు. ఎన్టీఆర్ 29వ వర్ధంతి సందర్భంగా స్థానిక పుళల్ కావాంగరైలో నందమూరి అభిమానులు శనివారం పారిశుద్ధ్య కార్మికులకు సహాయాలు, అల్పాహారం పంపిణీ చేశారు. వేదిక ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, నివాళులర్పించారు. అనంతరం జి.వెంగయ్య మాట్లాడుతూ... కోట్లాది మంది హృదయాల్లో ఎన్టీఆర్ నేటికి జీవిస్తున్నారని, తెలుగు జాతి ఔన్నత్యానికి, ఆత్మగౌరవానికి ఆయన ప్రతీకగా నిలిచారని కీర్తించారు. రాష్ట్రంలో ఉన్న తెలుగు వారంతా ఎన్టీఆర్‌ను స్ఫూర్తిగా తీసుకొని హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో లయన్ జి.మురళి, పి.నరసింహారావు, ఎం.చిట్టిబాబు, బి.ఓబుల్‌రెడ్డి, పి.వెంకట రమణ, జీవీ రామకృష్ణ, బెల్లం దామోదరన్, బి.శేఖర్ నాయుడు, బి.మురళి, వి.బాబూజీ, బి.గురవయ్య, ఎం.మునుస్వామి, ఎన్‌జీటీ రామారావు సహా మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఎన్టీఆర్ జోహార్ అంటూ జేజేలు పలికి ఘనంగా నివాళులర్పించారు.



కావాంగరైలో ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న అభిమానులు



మహాకుంభమేళాలో వైభవంగా శ్రీనివాసకల్యాణం

మహాకుంభమేళా సందర్భంగా ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో ఏర్పాటు చేసిన శ్రీవారి నమూనా ఆలయ ప్రాంగణంలో శనివారం ఉదయం శ్రీనివాసకల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం 11 నుంచి 12 గంటల మధ్య శాస్త్రోక్తంగా స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని నిర్వహించారు. తిరుమల శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకుడు వేణుగోపాలదీక్షితులు ఆధ్వర్యంలో అర్చక బృందం ఈకార్యక్రమాలు నిర్వహించింది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

తిరుమలలో దువ్వాడ, మాధురి



ఏక్తా కపూర్ - దువ్వాడ శ్రీనివాస్, దివ్వెల మాధురి

బ్రహ్మోత్సవాల సమయంలో తిరుమలలో వీడియో షూట్‌లో వివాదాస్పదం అయిన దువ్వాడ శ్రీనివాస్, దివ్వెల మాధురి శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. దీనిపై అప్పట్లో టీటీడీ కేసు కూడా పెట్టిన విషయం తెలిసిందే. ఈసారి ఎటువంటి వీడియో హంగామా లేకుండానే వారు శ్రీవారి దర్శనం చేసుకున్నారు. అలాగే శనివారం రాజస్థాన్ గవర్నర్ హరిబౌ కిషన్‌రావు బగాడే, తెలంగాణ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, ప్రముఖ సినీ నిర్మాత ఏక్తా కపూర్, టీటీడీ మాజీ జేఈవో శ్రీనివాసరాజు కూడా స్వామి దర్శనం చేసుకున్నారు. - తిరుమల, ఆంధ్రజ్యోతి

హుండీ ఆదాయం రూ.3.15 కోట్లు

తిరుమల వేంకటేశ్వరస్వామికి గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం లెక్కించగా రూ.3.15 కోట్లు ఆదాయం లభించింది.

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 61,142

తలనీలాలు సమర్పించినవారు: 19,736





పక్షులు.. పడవలు.. పర్యాటకులు..

అంబరాన్నంటిన పక్షుల పండుగ

ఏటా విహంగ ప్రేమికుల మనసు దోచుకుంటున్న ఫ్లెమింగో ఫెస్టివల్ సుమారు పాతికేళ్ల క్రితమే శ్రీకారం చుట్టుకొంది. దేశంలో మరెక్కడా లేనివిధంగా నిర్వహిస్తున్న ఈ ఉత్సవానికి బీజం పడిన నాటి విశేషాలను ఒకసారి మననం చేసుకుందాం.

- దొరవారిసత్రం, ఆంధ్రజ్యోతి

హుషారుగా.. పడవ షికారు

పెళ్లకూరు/తడ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): తడ మండలం భీములవారిపాళెం వద్ద పడవ షికారుకు సందర్శకులు ఉత్సాహం చూపారు. పెద్ద సంఖ్యలో పులికాట్ సరస్సులో విహరించారు. పడవషికారులో లైఫ్ జాకెట్లతోపాటు 10 మందికి మించి వెళ్లనీవ్వకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. పులికాట్ సరస్సు ఒడ్డున కొందరు నీళ్లల్లో ఆడుతూ సందడి చేశారు. అక్కడి వేదిక వద్ద స్థానిక కళాకారులు నృత్య ప్రదర్శన పాటలతో అలరించారు. అక్కడే విధుల్లో ఉన్న పెళ్లకూరు ఎంపీడీవో ప్రమీలారాణి బుల్లెట్ బైక్ పాటకు డ్యాన్స్ వేసి ఉత్సాహపరిచారు.

మొదటిసారి పడవ ప్రయాణం



మొదటిసారి పడవ షికారుకు వచ్చా. నీళ్లల్లో పడవ వెళ్తుంటే ఆనందంతో కేరింతలు కొట్టాలనిపించింది.

- విరోనిక, 6వ తరగతి, నాయుడుపేట

అహా.. వలస పక్షుల విన్యాసాలు

పులికాట్ సరస్సులో ఫ్లెమింగోలను చూడాలని వచ్చాం. వీటి విన్యాసాలను చూస్తుంటే అబ్బురపరుస్తున్నాయి. పిల్లలు వాటిని చూస్తూ ఎంజాయ్ చేస్తున్నారు.

- పూజిత, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, బుచ్చినాయుడుకండ్రిగ





ఫ్లెమింగో ఫెస్టివల్ వేదికపై పర్యాటక బ్రోచర్‌ను విడుదల చేస్తున్న మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే విజయశ్రీ తదితరులు

విహంగ వేడుక.. ఇంతింతై..

2000లో నెల్లూరు జిల్లా కలెక్టర్‌గా ప్రవీణ్‌కుమార్ పనిచేశారు. ఈ సమయంలో దొరవారిసత్రం మండలం కలగుంట రైల్వే వంతెన ప్రాంతంలో వేల సంఖ్యలో చక్కర్లు కొడుతున్న పక్షుల సమూహాలు ఆయనను ఆకర్షించాయి. అవి నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రం విడిదిలోని విదేశీ విహంగాలని తెలుసుకున్నారు. వీటిపై ప్రత్యేక ఫోకస్ పెట్టారు. నాటి శాసన సభ్యుడు పరసా వెంకటరత్నయ్య, టీడీపీ నేత వేనాటి రామచంద్రారెడ్డిలతో తన ఆలోచనలను పంచుకున్నారు. పక్షులతో విడదీయరాని బంధమున్న ఈ ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు వచ్చేలా పండగ నిర్వహించాలని సంకల్పించారు. ఫలితంగా నేలపట్టులో 2000 జనవరిలో పక్షుల పండుగ ప్రారంభమైంది. 2001లో సూళ్లూరుపేట వేదికగా నేలపట్టు, పులికాట్ సరస్సుల్లో ఫ్లెమింగో పేరిట జిల్లా స్థాయిలో పండుగ నిర్వహించారు. 2002లో అదే ఉత్సాహం కొనసాగించారు. వేడుక పుణ్యమాని నేలపట్టు ప్రాంతంలో పలు అభివృద్ధి పనులు శ్రీకారం చుట్టుకున్నాయి. 2003 ఫెస్టివల్ సమయానికి నేలపట్టులో రోడ్లు, టూరిజం భవనాలు, దొరవారిసత్రంలో టూరిజం హోటల్, తడలో టూరిజం హోటల్‌ను నెలకొల్పారు.

2016లో స్టేట్ ఫెస్టివల్‌గా..

2004, 2009లో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఫ్లెమింగో ఫెస్టివల్‌ను కొనసాగించింది. 2009లో టీడీపీ ఎమ్మెల్యేగా మళ్లీ గెలిచిన పరసా వెంకటరత్నయ్య నాటి ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డితో కలిసి చొరవ తీసుకుని పక్షుల పండుగ కొనసాగేలా చూశారు. 2014లో టీడీపీ అధికారంలోకి రావడంతో చంద్రబాబు 2016లో ఈవేడుకను ఏపీ టూరిజం క్యాలెండర్‌లో చేర్చారు. ప్రభుత్వం అధికారికంగా నిర్వహించేలా చర్యలు తీసుకున్నారు. అయితే విశేష జనాదరణ కలిగిన ఫ్లెమింగో ఫెస్టివల్‌ను గత వైసీపీ ప్రభుత్వం విస్మరించింది. 2019లో అధికారంలోకి వచ్చాక 2020లో మొక్కుబడిగా జరిపింది. తర్వాత నాలుగేళ్లు నిర్వహించలేదు. టీడీపీ అధికారంలోకి రావడంతో పక్షుల పండుగకు ఇప్పుడు మళ్లీ ప్రాణం వచ్చింది.

నేలపట్టు కిట.. కిట!

దొరవారిసత్రం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఫ్లెమింగో ఫెస్టివల్ మొదటి రోజైన శనివారం నేలపట్టు పక్షుల కేంద్రానికి సందర్శకులు క్యూకట్టారు.





ఉమ్మడి నెల్లూరు జిల్లాతో పాటు, చిత్తూరు, తమిళనాడు, ప్రకాశం జిల్లాల నుంచీ భారీగా తరలి వచ్చారు. కుటుంబ సమేతంగా.. చంటి బిడ్డలతో, దివ్యాంగులు, వృద్ధులు సైతం పక్షుల వీక్షణకు విచ్చేశారు. మంచి నీటి చెరువుల్లో విడిదిలో ఉన్న విహంగాలను వీక్షించారు. ఓ వైపు పక్షుల కేంద్రంలో పక్షులు తమ సంతతిని వృద్ధి చేసుకొనే పనిలో ఇప్పటికే పిల్లలను పొదిగాయి. వాటి చప్పుళ్లతో పాటు సందర్శకుల రాకతో నేలపట్టు సందడిగా మారింది. చెరువు కట్టలపై జనం కిక్కిరిశారు. వీరిని అదుపు చేయడం వలంటీర్లకు పెద్ద పనిగా మారింది. ఇక, బైనాక్యులర్లు సరిపడా లేకపోవడంపై సందర్శకులు అసంతృప్తి చెందారు. ఎక్కువ మంది సందర్శకులు తమతో తెచ్చుకొన్న కెమెరాలతో పాటు సెల్‌ఫోన్లలో పక్షుల ఫొటోలు తీస్తూ కనిపించారు. తామూ ఫొటోలు తీసుకుంటూ సందడి చేశారు. ఇక, ఈసీ కేంద్రంలో పక్షుల చిత్రాలు, శాండ్ ఆర్ట్, ఫిల్మ్ షో, పెలికాన్ అతిథి గృహాల వద్ద స్థానిక విద్యార్థులచే నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు సందర్శకులను అలరించాయి. మరోవైపు ఆకతాయిలు, చిల్లర దొంగల ఆటకట్టించేందుకు పోలీసులు పక్షుల కేంద్రంలోని పలు చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

ఉరితాడులా వన్యప్రాణి చట్టాలు

ఫ్లెమింగో సభలో మాజీ ఎమ్మెల్సీ వాకాటి

సూళ్లూరుపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పులికాట్ సరస్సు పై ఈ ప్రాంతంలో దాదాపు 10 వేల మందికి పైగా మత్స్యకారులు జీవనం సాగిస్తున్నారని, అంతేకాకుండా పులికాట్ సమీపంలో ఇరకం, వేనాడు దీవులు, కొరిడి-పేర్నాడు తీర ప్రాంత గ్రామాలు ఉన్నాయని గ్రామాల్లో అభివృద్ధి చేయాలన్న, రోడ్ల నిర్మాణాలు చేపట్టాలన్న వన్యప్రాణి చట్టాలు ఉరితాడులా మారాయని మాజీ ఎమ్మెల్సీ వాకాటి నారాయణ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. పక్కనే ఉన్న షార్ కేంద్రానికి మాత్రం చట్టాలు వర్తించవా? సరస్సు పై ఆధారపడి జీవనం సాగించే వారికి మాత్రం చట్టాలు వర్తిస్తాయా? ప్రభుత్వం దీని పై చొరవ తీసుకొని ఈ ప్రాంతాల అభివృద్ధికి అడ్డంకులు తొలిగేలా కొన్ని సడలింపులు తీసుకోవాలన్నారు. మాజీ మంత్రి పరసా మాట్లాడుతూ జాతీయ స్థాయిలో పక్షుల పండుగ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

గత ప్రభుత్వం పక్షుల పండుగ నిలిపివేసింది

● **వైసీపీ నేత సంచలన వ్యాఖ్య**

సూళ్లూరుపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి):గత ప్రభుత్వం 2020 తరువాత పక్షుల పండుగ నిలిపివేసిందని వైసీపీకి చెందిన సూళ్లూరుపేట మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి ఫ్లెమింగో ఫెస్టివల్ ప్రారంభోత్సవ సభలో చేసిన వ్యాఖ్యలు అందరినీ ఆశ్చర్యపరిచాయి. ప్రారంభ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాలుగేళ్లుగా ఆర్‌అండ్‌బీ రోడ్లు దారుణంగా దెబ్బతిని గుంతలమయమైపోయాయని అన్నారు.ప్రస్తుత ప్రభుత్వం ఆ రోడ్లకు మరమ్మతులు చేస్తోందన్నారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్‌కు సన్నిహిత కుటుంబంగా పేరున్న దబ్బల రాజారెడ్డి కుమారుడు వారి గత ప్రభుత్వంలోని లోపాలను ఎత్తిచూపుతూ మాట్లాడడంపై పలువురు చర్చించుకున్నారు.

కోస్టల్ కారిడార్‌లో పర్యాటక అభివృద్ధి చేస్తాం

● నేలపట్టులో రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్



నేలపట్టులో బైనాక్యులర్ ద్వారా పక్షులను వీక్షిస్తున్న రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్

దొరవారిసత్రం, జనవరి 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 970 కి.మీ మేర ఉన్న కోస్టల్ కారిడార్‌ను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. విదేశీ విహంగాలు విడిది చేసే నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రాన్ని శనివారం సాయంత్రం ఆయన సందర్శించారు. ఈసీ కేంద్రంలోని పక్షుల జీవన చిత్రాలను తిలకించారు. చెరువు కట్టపై నుంచి బైనాక్యులర్ ద్వారా పక్షులను వీక్షించారు. నేలపట్టు ప్రకృతి సిద్ధమైన, అరుదైన కేంద్రమని పేర్కొన్నారు. నేలపట్టు ప్రాముఖ్యత, విడిది చేసే పక్షుల జీవన శైలి గురించి డీఎఫ్‌వో హారిక వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. నేలపట్టును టూరిజంపరంగా మరింత అభివృద్ధి చేస్తామన్నారు. వైసీపీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకపోవడంతోనే ఇంతటి జనాదరణ ఉన్న ఫ్లెమింగో ఫెస్టివల్‌ను నిర్వహించలేదని విమర్శించారు. కూటమి అధికారంలోకి రాగానే పక్షుల పండుగ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మంత్రి వెంట గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా, ఎఫ్‌ఆర్‌వో సౌజన్య, తహసీల్దారు శైలాకుమారి తదితరులున్నారు.

పర్యావరణం.. పరిశ్రమలపై శ్రీసిటీలో సదస్సులు

శ్రీసిటీ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఫ్లెమింగో ఫెస్టివల్‌లో భాగంగా శనివారం 'పర్యావరణం.. పరిశ్రమలు'పై శ్రీసిటీలో సదస్సు నిర్వహించారు. శ్రీసిటీ బిజినెస్ సెంటర్‌లో జరిగిన కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్ఆర్) సదస్సులో పర్యావరణ నిర్వహణ, సామాజిక స్పృహ అంశాలను చర్చించారు. ఫ్లెమింగో ఫెస్టివల్‌లో శ్రీసిటీ పాల్గొనడం సుస్థిరత, పర్యావరణ పరిరక్షణ పట్ల దాని నిబద్ధతకు నిదర్శనమని కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. జీవ వైవిధ్యాన్ని రక్షించడానికి, ప్రకృతి సమతుల్యతను పెంపొందించడానికి పరిశ్రమలు, స్థానికుల సహకారం అవసరమన్నారు. పర్యావరణ పరిరక్షణతో వ్యాపార లక్ష్యాలను సమతుల్యం చేయడానికి సీఎస్ఆర్ కార్యక్రమాలు చేపట్టాలని అటవీశాఖ కన్జర్వేటర్ సి.సెల్వం కోరారు. పులికాట్ సరస్సు, వలస పక్షుల నివాసాల రక్షణకు కార్పొరేట్ భాగస్వామ్యాలను ప్రోత్సహిస్తూ బీఎన్‌హెచ్ఎస్ డైరెక్టర్ కిషోర్ రితే ప్రత్యేక ప్రదర్శన ఇచ్చారు. ఇక్కడ హరిత పరిశ్రమలను మాత్రమే ఏర్పాటు చేస్తున్నామని శ్రీసిటీ చైర్మన్ సి.శ్రీనిరాజు తెలిపారు. అభివృద్ధితో పాటు ప్రకృతి పరిరక్షణపైనా ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. పులికాట్ సరస్సును కాపాడుకోవడానికి సమష్టి, నిరంతర కృషి అవసరమని శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి పేర్కొన్నారు. దీనికి ఫ్లెమింగో ఫెస్టివల్ ఎంతో ఉపకరిస్తుందన్నారు. శ్రీసిటీ పరిశ్రమల సీఎస్ఆర్ ప్రయత్నాలను అభినందిస్తూ ఐఎంవోపీ, కెల్లాగ్స్, పార్సన్ ప్యాకేజింగ్స్,ఇసుజు మోటార్స్, టీహెచ్‌కే, కోల్గేట్ పామోలివ్,డైకి అల్యూమినియం, బెర్గెన్‌పైప్స్, డానియేలీ, హామిల్టన్, ఆస్ట్రోటెక్, పియోలెక్స్, ఎస్ఎంసీసీ, వెస్ట్ ఫార్మా పరిశ్రమల అధికారులకు కలెక్టర్ జ్ఞాపికలను అందజేశారు. క్రియా విశ్వ విద్యాలయంలో జీవ వైవిధ్యం, చిత్తడి నేలల సంరక్షణపై రెండు రోజుల సమావేశం కూడా బాంబే నేచురల్ హిస్టరీ సొసైటీ(బీఎన్‌హెచ్ఎస్)కి చెందిన డాక్టర్ సత్యసెల్వం అధ్యక్షతన శనివారం ప్రారంభమైంది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(ఐఐఎస్ఈఆర్), పక్షి శాస్త్ర నిపుణుల భాగస్వామ్యంతో జరిగిన ఈ సమావేశంలో వృక్ష, జంతు వైవిధ్యం, మత్స్య, పర్యాటక ప్రయోజనాలు, హైడ్రోలాజికల్ డైనమిక్స్, వాతావరణ మార్పు ప్రభావాలు, కాలుష్యం తగ్గించడం తదితర ప్రయత్నాల్లో సమాజ భాగస్వామ్యంపై చర్చించారు.



సీఎస్ఆర్ బహుమతి అందజేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

నేటి కార్యక్రమాలిలా..

తడ, ఆంధ్రజ్యోతి: ఆదివారం జరిగే సాంస్కృతిక కార్యక్రమాల్లో సినీ సంగీత దర్శకుడు రఘు కుంచె, గాయని మంగ్లి పాల్గొననుండగా, బిగ్‌బాస్ ఫేమ్ అషరెడ్డి, రవి యాంకర్లుగా వ్యవహరించనున్నారు.

నేడు ప్రాంతీయ ఫోరెన్సిక్ సైన్సు లాబొరేటరీ ప్రారంభం

తిరుపతి(నేరవిభాగం), జనవరి 18(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో రూ.3.6 కోట్లతో నిర్మించిన ప్రాంతీయ ఫోరెన్సిక్ సైన్సు లాబొరేటరీని ఆదివారం కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ఈ ఏర్పాట్లపై అదనపు ఎస్పీ వెంకట్రావు, జీడీ ఈశ్వరయ్య, ఎంటీవో రాజశేఖర్, ఫోరెన్సిక్ సిబ్బందితో ఇన్‌చార్జి ఎస్పీ మణికంఠ సమీక్షించారు. ఈ ఫోరెన్సిక్ లేబొరేటరీ జిల్లా భద్రతా రంగానికి, న్యాయ వ్యవస్థకు ఉపయోగపడుతుందని తెలిపారు.



జవహర్ నవోదయ పరీక్షకు 1,519 మంది హాజరు

తిరుపతి(విద్య), జనవరి 18 (ఆంధ్రజ్యోతి): జవహర్ నవోదయ స్కూళ్లలో 6వ తరగతి ప్రవేశ పరీక్ష శనివారం ప్రశాంతంగా జరిగిందని డీఈవో కేవీఎన్ కుమార్ తెలిపారు. తిరుపతి నగరంలోని రెండు కేంద్రాలతో పాటు గూడూరు, కోట, నాయుడుపేట, సూళ్లూరుపేట, వెంకటగిరి, పుత్తూరు, సత్యవేడు, శ్రీకాళహస్తి ప్రాంతాల్లో మొత్తం 10 కేంద్రాల్లో పరీక్ష జరిగిందని, 2,313 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని, 1,519 మంది హాజరుకాగా 794 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు.

ఫ్లెమింగో ఫెస్టివల్‌కు అదనపు బస్సులు

తిరుపతి(ఆర్టీసీ), జనవరి 18 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో నిర్వహిస్తున్న ఫ్లెమింగో ఫెస్టివల్‌లో భాగంగా సందర్శకుల సౌకర్యార్థం ఆర్టీసీ అధికారులు అదనపు బస్సులను ఏర్పాటు చేశారు. సూళ్లూరుపేట కేంద్రంగా నాయుడుపేట వయా నేలపట్టు, భీమునివారిపాలెం, షార్ వయా అత్తికానితిప్పలకు ఒక్కోటి చొప్పున, నెల్లూరుకు 3 బస్సులను ఏర్పాటు చేశారు. ఇక తిరుపతి-సూళ్లూరుపేట మధ్య రెగ్యులర్‌గా తొమ్మిది తిరుగుతుండడంతో అదనపు బస్సులు అవసరపడలేదు. సందర్శకులు సద్వినియోగం చేసుకోవాలని ప్రజారవాణాధికారి జి.నరసింహులు కోరారు.